ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 26 డిసెంబరు 2024



సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

● దరఖాస్తులకు ఆఖరు తేదీ జనవరి 13

కలికిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ జారీ అయ్యింది. 6, 9వ తరగతుల్లో ప్రవేశాలకు అర్హత పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దేశవ్యాప్తంగా ఉన్న సైనిక్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం అర్హత పరీక్ష నిర్వహించనుంది. జనవరి 13వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులను పంపుకోవాలి. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించాల్సి ఉంది. అదేవిధంగా దరఖాస్తు ఫీజు కూడా ఆన్‌లైన్ ద్వారానే డెబిట్/క్రెడిట్ కార్డులు లేక ఇంటర్‌నెట్ బ్యాంకింగ్/యూపీఐ చెల్లింపుల ద్వారా జనవరి 14వ తేదీ రాత్రి 11.50 గంటలలోగా చెల్లించాలి. 6వ తరగతి ప్రవేశాలకు 2025 మార్చి 31 తేదీకి 10-12 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. 9వ తరగతి ప్రవేశాలకు అదే తేదీ నాటికి 13-15 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. బాలికలకు 6వ తరగతిలో మాత్రమే ప్రవేశాలుంటాయి. 9వ తరగతిలో ప్రవేశాలకు గుర్తింపు కలిగిన పాఠశాలల్లో చదివి సైనిక్ పాఠశాలలో ప్రవేశం పొందే నాటికి 8వ తరగతి పాస్ అయి ఉండాలి. జనరల్/ఓబీసీ (ఎన్‌సీఎల్)/రక్షణ శాఖ/ మాజీ సైనికుల విద్యార్థులకు రూ.800 ఫీజు నిర్ణయించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రూ.650. కలికిరి సైనిక్ స్కూల్‌కు సంబంధించి 6వ తరగతిలో బాలికలకు కూడా ప్రవేశం ఉంటుంది. 6, 9 తరగతుల్లో సీట్ల సంఖ్యకు సంబంధించి నోటిఫికేషన్‌లో ఎలాంటి వివరాలు ఇవ్వకపోయినప్పటికీ గత సంవత్సరంలో మాదిరిగానే 6వ తరగతిలో 105 సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. ఇందులో బాలికలకు 10 సీట్లు ఉంటాయి. 9వ తరగతిలో మాత్రం 10 సీట్లకు కొంచెం అటు ఇటుగా డ్రాపౌట్స్‌ను బట్టి ఉంటాయి. అర్హత పరీక్ష తేదీని ఆ తరువాత ఎన్‌టీఏ వెబ్‌సైట్ ద్వారా ప్రకటించనున్నారు. మామూలుగా ప్రతి ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల కావలసి ఉండేది. డిసెంబరుకల్లా దరఖాస్తుల స్వీకరణ పూర్తయి ఆ తరువాత జనవరిలో అర్హత పరీక్ష నిర్వహించి ఫిబ్రవరి ఆఖరుకల్లా ఫలితాలు వెలువరించేవారు. అయితే ఈ ఏడాది నోటిఫికేషన్ జారీ కావడంలోనే దాదాపు రెండు నెలలు ఆలస్యమైంది.

బీసీ బాలికల గురుకుల పాఠశాలకు అరుదైన పురస్కారం

● జాతీయ స్థాయిలో విప్రో ఫౌండేషన్ గుర్తింపు

● రాష్ట్రం నుంచి ఎన్నికైన ఒకే ఒక పాఠశాల

కలికిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కలికిరిలోని జ్యోతీబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల అరుదైన పురస్కారం దక్కించుకుంది. విప్రో అజీమ్‌జీ ఫౌండేషన్ జాతీయ స్థాయిలో ప్రకటించిన 'విప్రో ఎర్తియన్-2024 జాతీయ అవార్డు'కు ఈ పాఠశాలను ఎంపిక చేసింది. భూతాప నివారణకు ఈ పాఠశాల ప్రతిపాదించిన సుస్థిర పర్యావరణ పరిరక్షణ విధానంపై ఏపీ నుంచి ఒకే ఒక ఉత్తమ ప్రతిపాదనగా ఎంపికైంది. దేశవ్యాప్తంగా మొత్తం 1550 పాఠశాలలు ఈ పోటీకి పలు రకాల ప్రాజెక్టులను సమర్పించాయి. అందులో 15 రాష్ట్రాలకు చెందిన 23 పాఠశాలలకు పురస్కారాలు ప్రకటించారు. అందులో ఏపీ నుంచి కలికిరి పాఠశాల ప్రతిపాదించిన ప్రాజెక్టుకు మాత్రం ఆమోదం లభించింది. పాఠశాలకు చెందిన విద్యార్థినులు జె.శ్రీరూపిక, కె.ఖ్యాతి, టి.భవ్యశ్రీ, ఎం.చందన అగర్వాల్, పి.సుప్రియలు సంయుక్తంగా 'సస్టైనబులిటీ, వేస్ట్ మేనేజిమెంట్' అనే అంశంపై ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ మేరకు విప్రో ఫౌండేషన్ నుంచి మంగళవారం పాఠశాలకు సమాచారం అందింది. ఫిబ్రవరి 21, 22 తేదీల్లో బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో విప్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపికైన ప్రాజెక్టు రూపకర్తలకు అవార్డులను అందించనున్నారు. విప్రో చైర్మన్ రిషిద్ ప్రేమ్‌జీ, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈవో అనురాగ్ బెహర్‌లు ఈ జాతీయ స్థాయి అవార్డులు ప్రదానం చేయనున్నట్లు అజీమ్ ప్రేమ్‌జీ పాఠశాలకు పంపిన సమాచార పత్రంలో తెలిపింది. ప్రాజెక్టు రూపకల్పనలో పాల్గొన్న ఐదుగురు విద్యార్థినులతో పాటు ఒక ఉపాధ్యాయురాలికి రానూ, పోనూ విమాన ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కూడా ఫౌండేషన్ పేర్కొంది. కార్యక్రమంలో అన్ని రకాల సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలతో పాటు రూ.50 వేల నగదును పాఠశాలకు అందజేయనున్నారు. కాగా గురుకుల పాఠశాల విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధించాలని ప్రిన్సిపాల్ సోమశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం పాఠశాలలో ప్రాజెక్టుల రూపకల్పనకు కృషి చేసిన విద్యార్థినులను అభినందించారు. వారికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయినులు డాక్టర్ జి.అఫ్సానా, సి.స్వర్ణకుమారి, పి.దిల్షాద్ బేగంలను కూడా ఆయన అభినందించారు.


విప్రో జారీ చేసిన సమాచారాన్ని చూపుతున్న ప్రిన్సిపాల్ సోమశేఖర్, విద్యార్థినులు, ఉపాధ్యాయులు

రక్తం తాగిన రోడ్లు..

రౌండప్ 2024

● ప్రాణాలు తీసిన ప్రమాదాలు..
● వందకు పైగా మరణాలు..
రెట్టింపు సంఖ్యలో క్షతగాత్రులు
● విషాదాన్ని నింపిన 2024

జిల్లా ప్రజలకు 2024 సంవత్సరం తీవ్ర విషాదాన్ని నింపింది. 200కు పైగా రోడ్డు ప్రమాదాలు జరగ్గా అందులో వందమందికిపైగా మృత్యువాతపడ్డారు. మృతుల కంటే.. ఎక్కువ సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. పుట్టినరోజు పండగని.. దేవుడి దర్శనమని, చావుకని, తద్దినానికని.. సరదాగా గడుపుదామని.. ఇలా రోడ్డెక్కిన ప్రజల రక్తాన్ని రోడ్లు తాగేశాయి. కుటుంబాలకు కుటుంబాలనే అనాథలుగా మిగిల్చాయి. చెట్టంత కొడుకును కోల్పోయిన తల్లి గుండెకోతకు సజీవ సాక్ష్యాలుగా ఈ ప్రమాదాలు నిలిచాయి. భార్యాభర్తలిద్దరినీ.. పొట్టనపెట్టుకుని.. వాళ్ల బిడ్డలకు దిక్కే లేకుండా చేశాయి. ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు చివరి వారం వరకు జిల్లాలో జరిగిన కొన్ని ఘోర ప్రమాదాలను పరిశీలిస్తే..


గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఫైల్)


కలకడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారు (ఫైల్‌ఫొటో)

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కలకడ ఇందిరమ్మ కాలనీకి సమీపంలో అక్టోబరు 21న ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణం చేస్తున్న ఒకే కుటుంబంలోని ఐదుగురు మృత్యువాతపడ్డారు. సంబేపల్లె మండలం రౌతుకుంట పంచాయతీ వంగిమల్లవారిపల్లెలో సమీప బంధువైన వృద్ధురాలు అంత్యక్రియలకు కలికిరి మండలం దూదేకులపల్లెకు చెందిన ఎస్సానుల్లా కుటుంబం వెళ్లి వస్తుండగా ఘోరం జరిగింది. ప్రమాదంలో ఎస్సానుల్లా భార్య అమ్మాజి అలియాస్ ఖాదర్‌బీ (55), అల్లుళ్ల ఖాదర్‌వలి (30), నూరుల్లా (35), వియ్యంకురాలు ఫకీరాబీ (60) అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్తె దిల్షాన్ (25) తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ దుర్ఘటనలో చిన్నారి సారా.. తన తల్లిదండ్రులు ఖాదర్‌వలి, దిల్షాద్‌లను కోల్పోయింది. ఆటోలో ఏడుగురు ఉండగా ఐదుమంది చనిపోయారు.

దీపం చూసేందుకు వెళ్లి...

రామాపురం మండలంలోని గువ్వలచెరువు ఘాట్‌లో ఆగస్టు 26వ తేదీ కారును కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురరు మృతి చెందారు. చక్రాయపేట మండలం కోడివారిపల్లె కుప్పం గ్రామానికి చెందిన చిన్నవెంకటమ్మ భర్త సత్యనారాయణ మృతి చెందారు. దీంతో ఆమె బంధువుల ఇళ్లలో దీపం చూసే సాంగ్యం కోసం వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ, నాగలక్ష్మి, నాగయ్య, కారు డ్రైవర్, కంటైనర్ డ్రైవర్‌లు మృత్యువాతపడ్డారు.

కుమారుడి పుట్టిన రోజు ముచ్చట కోసం..

పీలేరు పట్టణం సరోజినినాయుడు వీధికి చెందిన రహంతుల్లా (47) తన కుమారుడు ఆసిఫ్ అహ్మద్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబరు 19న ద్విచక్ర వాహనంలో హార్సిలీహిల్స్‌కు వెళ్తుండగా.. వాల్మీకిపురం మండలం చింతలవారిపల్లె బస్టాప్ వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రహంతుల్లా అక్కడికక్కడే మృతి చెందారు. కుమారుడు అహ్మద్ తీవ్రంగా గాయపడ్డారు. బిడ్డ ముచ్చట తీర్చేందుకు.. వెళ్తూ.. తండ్రి చనిపోవడంతో.. ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్నేహితుడి పుట్టిన రోజుకొచ్చి..

రాజంపేట మండలం బోయినపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా డిసెంబరు 14న ద్విచక్రవాహనంలో వెళ్తున్న స్నేహితులు బన్నీనాథ్ రెడ్డి (20), కిరణ్ (20)లు కారు ఢీకొనడంతో..అక్కడికక్కడే చనిపోయారు. స్నేహితుడు కిరణ్ పుట్టిన రోజు కోసం స్నేహితుడు బన్నీనాథరెడ్డి ఇక్కడికి వచ్చాడు.

మరణంలోనూ వీడని స్నేహం

తంబళ్లపల్లె మండలానికి చెందిన అరుణ్‌కుమార్ రెడ్డి, యశ్వంత్‌కుమార్‌రెడ్డిలు ప్రాణ స్నేహితులు.. ఇద్దరూ మదనపల్లెలోని ప్రైవేటు డిగ్రీ కాలేజ్‌లో చదివేవాళ్లు. అక్టోబరు 18న కాలేజి ముగిసిన తర్వాత సాయంత్రం ఇంటికి వస్తుండగా కురబలకోట మండల పరిధిలో ఆర్టీసీ బస్సు టూ వీలర్‌ను ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. ఇద్దరి తల్లిదండ్రులకు ఒకరే కొడుకులు కావడం.. వాళ్లు మృత్యువాత పడడంతో ఆ కుటుంబాల్లో విషాదం నింపింది.

తండ్రి ముందే మృత్యు కౌగిలి

తంబళ్లపల్లె మండలం ఆర్‌ఎన్ తండాకు చెందిన మహేష్‌నాయక్ కొడుకు అక్షయ్ (10) పుంగనూరులో చదువుతున్నాడు. వినాయకచవితి పండగకు వచ్చిన కొడుకును స్కూల్లో వదిలేందుకు మహేష్‌నాయక్ తన ఆటోలో ఈ ఏడాది సెప్టెంబరు 14న ఆటోలో తీసుకెళ్లాడు. తండ్రి పక్కనే కూర్చున్న అక్షయ్ కురబలకోట మండలం దాదంవారిపల్లె వద్ద గుంతల రోడ్డులో వెళుతుండగా ఆటో కుదుపులకు రోడ్డుపైన పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు.

విషాదం నింపిన వినాయక నిమజ్జనం

పెద్దమండెం మండలం పాపేపల్లె పంచాయతీ గుడిసెవారిపల్లెకు చెందిన గ్రామస్థులు ఎంతో సంబరంగా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనం ముగించుకుని వస్తుండగా చెరువు గట్టుపై గ్రామస్థులు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇర్ఫాన్ అనే బాలుడు మృతి చెందాడు.


ఓబులవారిపల్లె మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్యాభర్త, కొడుకు (ఫైల్)

మృత్యుకౌగిట భర్త, భార్య, కొడుకు..

ఓబులవారిపల్లె మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్టపై డిసెంబరు 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజంపేట మండలం భువనగిరిపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు కోలాటం నరసింహ, అతడి భార్య సుజాత మృతి చెందారు. అత్తారింటికి వెళ్లి వస్తుండగా చెరువుకట్టపై మినీ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొడుకు నాలుగు రోజుల తర్వాత చనిపోయాడు.

మలిపెళ్లికని వెళ్తూ..

రైల్వేకోడూరు మండలంలోని మైసూర్‌వారిపల్లె పంచాయతీలోని రాజానగర్ ప్రధాన జాతీయ రహదారిపై అక్టోబరు 23న ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో కర్నూలుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ప్రేమ్‌కుమార్, వాసవి, సుచిత్ర మృతి చెందారు. తిరుపతిలో జరిగే మలిపెళ్లి కార్యక్రమానికి వెళుతూ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు.

200కు పైగా ప్రమాదాలు.. వందకు పైగా మరణాలు

ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు చివరి వారం వరకు జిల్లా వ్యాప్తంగా పెద్దవి, చిన్న ప్రమాదాలు కలిసి దాదాపు 200 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ఒకే ప్రమాదంలో ఐదుగురు చనిపోయిన సంఘటనలు రెండు ఉండగా.. ఒకరికి మించి చనిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఎక్కువగా ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదాలే ఉన్నాయి. సంబేపల్లె మండల పరిధిలో ఈ ఏడాదిలో 31 రోడ్డు ప్రమాదాలు జరగ్గా అందులో 20 మంది మృతి చెందారు. 11 మంది గాయపడ్డారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో 8 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అందులో ముగ్గురు మృతి చెందారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వేంపల్లె-రాయచోటి జాతీయ రహదారి రోడ్డు మరమ్మతు పనులు జరుగుతుండడంతో చాలా ప్రమాదాలు జరిగి.. కాళ్లు చేతులు పోగొట్టుకున్న వారు చాలామంది ఉన్నారు. రైల్వేకోడూరు మండలంలో 39 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 29మంది చనిపోయారు. 52 మంది గాయపడ్డారు. ఓబులవారిపల్లె మండలంలో 24 ప్రమాదాల్లో 13 మంది చనిపోయారు. 27 మంది గాయపడ్డారు. చిట్వేలి మండలంలో 11 రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు చనిపోయారు. 15 మంది గాయపడ్డారు. పుల్లంపేట మండలంలో 18 ప్రమాదాల్లో.. 9 మంది చనిపోయారు. 14 మంది గాయపడ్డారు. రాజంపేట మండలంలో 14 రోడ్డు ప్రమాదాల్లో.. 16 మంది చనిపోయారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ప్రతిరోజూ జిల్లాలో ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదం జరిగి.. మరణాలు సంభవించాయనే చెప్పవచ్చు. ఈ ప్రమాద సంఘటనలు, సంభవించిన మరణాలు, క్షతగాత్రులను గమనిస్తే.. 2024 సంవత్సరం జిల్లా ప్రజలకు కన్నీటిని మిగిల్చింది.





కబేళాలకు తరలుతున్న ఎద్దులు స్వాధీనం

● రెండు లారీలలో 64.. ● అక్రమ తరలింపుపై కేసు నమోదు

బి.కొత్తకోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కబేళాలకు రెండు లారీల్లో తరలిస్తున్న ఎద్దులను పోలీసులు పట్టుకుని వాటికి విముక్తి కల్పించిన సంఘటన బుధవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. హైదరాబాద్-చెన్నై జాతీయ రహదారిలోని ములకలచెరువు-మదనపల్లె మార్గంలో పశువుల తరలింపు జరుగుతున్నట్లు మంగళవారం రాత్రి పోలీసులకు సమాచారం వచ్చింది. బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తన సిబ్బందితో స్థానికుల సహాయంతో మండల పరిధిలోని గోళ్లపల్లె వద్ద పశువులను తరలిస్తున్న ఏపీ39-డబ్ల్యు4353, ఏపీ39 డబ్ల్యు4352 నెంబర్లు గల లారీలను పట్టుకుని పరిశీలించగా అందులో 66 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. స్థానిక పశువైద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డిని పిలిపించి పశువుల జాతి, విలువ, వయస్సు తదితర అంశాలను పరిశీలించారు. ప్రధాన నిందితుడిగా భావిస్తున్న పుంగనూరుకు చెందిన మహమ్మద్‌ఆరిఫ్‌ను విచారించగా తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు పశువుల మార్కెట్‌లో ఎద్దులను కొనుగోలు చేసి పుంగనూరు సంతలో విక్రయించడం తమ వ్యాపారం అని అందులో భాగంగానే ఈ ఎద్దులను తరలిస్తున్నామని పోలీసులకు తెలిపారు. ఎద్దుల వ్యాపారి ఆరిఫ్, లారీలలో వచ్చిన కూలీలు పొంతన లేని సమాధానాలు చెప్పడం, లారీలలో కుక్కిన కారణంగా గాయపడిన పశువులను చూసి మూగజీవాల తరలింపు నిరోధక చట్టం, జీవహింస, గోవధ నిషేధం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు చర్యలకు పూనుకున్నారు. వీఆర్వో నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు పుంగనూరుకు చెందిన వ్యాపారి మహమ్మద్‌ఆరిఫ్‌తో పాటు అబ్దుల్‌మునాఫ్, సుబ్రహ్మణ్యం, ముబారక్, యస్.అక్బర్, మహబూబ్‌బాష, క్రిష్ణప్పలపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టుబడిన పశువులను తమిళనాడులోని సేలంకు తరలిస్తున్నట్లు అనుమానాలున్నాయన్నారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను రాయచోటిలోని గోశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, దర్యాప్తులో తేలిన అంశాల మేరకు నిందితులపై చర్యలుంటాయని అన్నారు.

నిన్న కాసులు.. నేడు కన్నీళ్లు..

● 23 కేజీల టమోటా బాక్సు రూ.50 నుంచి రూ.250 మాత్రమే

● ములకలచెరువు మార్కెట్‌కు భారీగా తగ్గిన టమోటాలు

● నెల రోజుల క్రితం 50 వేల బాక్సులు ● ప్రస్తుతం 10 వేల బాక్సుల లోపే

ములకలచెరువు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీజన్‌లో రైతులకు కాసులు కురిపించిన టమోటా...ఇప్పుడు కన్నీళ్లు తెప్పిస్తోంది. నెల రోజుల క్రితం వరకు ఆశాజనకంగా ఉన్న ధరలు నేడు కుప్పకూలాయి. ములకలచెరువు మార్కెట్‌లో బుధవారం 23 కేజీల బాక్సు నాణ్యతను బట్టి రూ.50 నుంచి రూ.250 వరకు మాత్రమే పలికాయి. దీనిని బట్టి చూస్తే కిలో రూ.2 నుంచి రూ.10 వరకు మాత్రమే పలికింది. సీజన్‌లో బాక్సు రూ.1400 నుంచి రూ.1900 వరకు పలికింది. నెల రోజుల క్రితం వరకు బాక్సు రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు పలికింది. ప్రస్తుతం టమోటా ధరలు పతనమయ్యాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ధరలు లేకపోవడంతో కాయలు కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఇక్కడి నుంచి టమోటాలు మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ఎగుమతి అవుతున్న రాష్ట్రాల్లో టమోటా సాగు పెరగడం, భారీగా దిగుబడి వస్తుండడంతో ఇక్కడి టమోటాలకు డిమాండ్ భారీగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి కేవలం తమిళనాడు రాష్ట్రానికి మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. టమోటాల ధరలు కుప్పకూలడంతో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. పంట సాగు కోసం చేసిన అప్పులు ఎటా తీర్చాలో అర్థం కాక కుమిలిపోతున్నారు. టమోటా ధరలు అన్నదాతకు కంట నీరు తెప్పిస్తున్నాయి.

నాడు కళకళ.. నేడు వెలవెల..

నెల రోజుల క్రితం వరకు కిక్కిరిసిపోయిన ములకలచెరువు మార్కెట్ నేడు వెలవెలబోతోంది. మార్కెట్‌కు టమోటాలు అమ్మకానికి రావడం భారీగా తగ్గిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జూన్ నుంచి నవంబరు నెల వరకు ప్రతిరోజూ మార్కెట్‌కు 50 వేల బాక్సుల టమోటాలు అమ్మకానికి వచ్చేవి. ప్రస్తుతం కేవలం 10 వేల బాక్సుల లోపే వస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే మార్కెట్‌కు టమోటాలు అమ్మకానికి రావడం ఎంత వరకు తగ్గాయో అర్థం చేసుకోవచ్చు. రైతులు సాగు చేసిన టమోటా తోటల్లో దిగుబడి అయిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సాగు అంతంతమాత్రంగా ఉండడం, ధరలు కూడా పతనం కావడంతో ఉన్న తోటల్లో కూడా టమోటాలను కోత కోయడం లేదు. ఈ కారణంగా మార్కెట్‌కు టమోటాలు రావడం భారీగా తగ్గిపోయింది.


టమోటాలు రావడం భారీగా తగ్గిపోవడంతో వెలవెలబోతున్న మార్కెట్ యార్డు

గతంలో ఇక్కడి నుంచి ప్రతిరోజూ 45 నుంచి 50 లారీల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ప్రస్తుతం కేవలం 10 లారీల కాయలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. ములకలచెరువు మార్కెట్‌కు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలతో పాటు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి టమోటాలను రైతులు అమ్మకానికి తెస్తున్నారు. ములకలచెరువు మార్కెట్‌కు బుధవారం అతి తక్కువగా టమోటాలు అమ్మకానికి వచ్చాయి. దీంతో నెల రోజుల క్రితం వరకు టమోటాలు తీసుకొస్తున్న వాహనాలు, రైతులు, టమోటాలతో కిక్కిరిపోయిన మార్కెట్ యార్డు నేడు బోసిపోతోంది. స్థలం చాలక టమోటాలు తీసుకొచ్చిన వాహనాలను జాతీయ రహదారి పక్కన, మార్కెట్‌కు ఆనుకొని ఉన్న ఆర్టీసీ బస్టాండు ఖాళీ స్థలంలో ఉంచేవారు. ప్రస్తుతం దీనికి భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. నెల రోజుల క్రితం వరకు ప్రతిరోజూ సాయంత్రం 3 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు కొనసాగిన మార్కెట్ ప్రస్తుతం 11.30 గంటలకే ముగుస్తోంది.

ఘనంగా క్రిస్మస్ పండుగ

● జిల్లావ్యాప్తంగా కళకళలాడిన చర్చిలు

రాయచోటిటౌన్/మదనపల్లె అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రైస్తవులు క్రిస్మస్ పండుగను బుధవారం వైభవంగా జరుపుకున్నారు. జిల్లాలోని చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కొన్ని చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుధవారం ఉదయం నుంచి చర్చిలన్నీ కళకళలాడాయి. రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ ఎస్ఎస్‌జీ శుభకర్ ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నారు. అలాగే రాయచోటి పట్టణంలోని బేతల్‌కాలనీ కొత్తపేటలో చర్చి వీధితో పాటు దిగువ అబ్బవరం, శిబ్యాల, యండపల్లి తదితర ప్రాంతాల్లో కూడా ఆయా చర్చిల్లో క్రిస్మస్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకొని కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మదనపల్లె పట్టణ, రూరల్ మండలంలోని క్రిస్టియన్లు పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మదనపల్లె పట్టణంలోని పురాతనమైన జాకబ్‌చాంబర్లిన్ చర్చిలో రాయలసీమ డయాసిస్ బిషప్ రెవరెండ్ వరప్రసాద్ క్రిస్మస్ పండుగ గురించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సీఎస్ఐ చర్చి ఆవరణం అంతా భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సీఎస్ఐ, చిత్తూరు బస్టాండ్ సమీపంలోని ఇమ్మానియల్ మినిస్ట్రీస్ చర్చిల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. మదనపల్లె రూరల్ మండలంలోని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ చర్చిలో, ఆరోగ్యవరంలోని సెయింట్ లూక్స్ చర్చిలో, గుడిసెవారిపల్లెలోని సెయింట్ జాన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.




మదనపల్లె సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న రాయలసీమ డయాసిస్ పాస్టర్ వరప్రసాద్.. పాల్గొన్న విశ్వాసులు

కళాకారుడి హత్య కేసును నీరుగారుస్తున్న సీఐ

● డీఎస్పీ కృష్ణమోహన్‌కు హక్కుల నేతల ఫిర్యాదు



డీఎస్పీ కృష్ణమోహన్‌కు వివరాలు తెలియజేస్తున్న హక్కుల నేతలు

రాయచోటి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లె వద్ద ఈనెల 23న జరిగిన మల్లెల వెంకట్రమణ (25) హత్యకేసును లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి నీరు గార్చే ప్రయత్నంలో ఉన్నాడని, ఈ కేసు విచారణ బాధ్యతల నుంచి ఆయనను తప్పించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్, నిజనిర్ధారణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం వారు బోరెడ్డిగారిపల్లెను సందర్శించి స్థానికులను, ప్రత్యక్ష సాక్షులను, పోలీసులను విచారించిన అనంతరం రాయచోటిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కేసును సరైన పద్ధతిలో విచారణ చేయకుండా సీఐ నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇప్పటి వరకు చేసిన దర్యాప్తులోని లోపాలను డీఎస్పీ కృష్ణమోహన్‌కు వివరించినట్లు తెలియజేశారు. ఈ కేసులో రమణారెడ్డితో పాటు మరో ఇద్దరు పాల్గొన్నట్లు తెలుస్తోందన్నారు. సీఐ మాత్రం రమణారెడ్డి పేరును మాత్రమే ఎఫ్ఐఆర్‌లో చేర్చడం, విచారణలో జాప్యం చేయడం, బాధితులనే బెదిరిస్తుండడంతో ఈకేసు విచారణ సవ్యంగా జరుగుతుందనే నమ్మకం లేకుండా పోయిందన్నారు. వెంటనే సీఐ కొండారెడ్డిని విచారణ బాధ్యతల నుంచి తప్పించి మరొక అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, మారుతీశంకర్, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ మునీర్‌పై దాడి కేసు నమోదు

ప్రొద్దుటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ మునీర్ అతని సోదరుడు బషీర్‌పై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో దాడి కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. కౌన్సిలర్ మునీర్ సోదరుడు బషీర్ గ్రీన్‌ల్యాండ్‌కు చెందిన మహ్మద్ హుస్సేన్ అనే వ్యక్తికి డబ్బులు బాకీ వున్నాడు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 23న గ్రీన్‌ల్యాండ్‌లో గొడవ జరిగింది. దీంతో కౌన్సిలర్ మునీర్ తనపై దాడి చేశారని మహ్మద్ హుస్సేన్ మరో నలుగురిపై రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టాడు. ఇదిలావుండగా బుధవారం ఉదయం జిన్నారోడ్డులో తాను నిలబడివుండగా కౌన్సిలర్ మునీర్, అతని సోదరుడు బషీర్‌లు వచ్చి తనపై దాడి చేశారని మహ్మద్ హుస్సేన్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు విచారించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎల్ఐసీ ఆఫీసు వద్ద ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని, రాత్రి నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించామని.. ఇతర వివరాలకు 9121100511కు ఫోను చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు.

మురుగుకాల్వలో పడి మహిళ మృతి



కడప క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మోచంపేట కాల్వ వద్ద బుధవారం ఓ మహిళకు ఫిట్స్ రావడంతో కాలువలో పడి మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమరనాథరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మోచంపేటకు చెందిన విజయకుమారి (33) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో పాటు ఫిట్స్‌తో బాధపడుతుండేది. ఆమెకు భర్త నాగేశ్వర్‌రావు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం నడుచుకుంటూ వెళుతుండగా.. ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న మురుగుకాల్వలో పడి పోయింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో కాల్వలోనే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. మృతురాలు సోదరుడు సంజీవ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి.. తీవ్ర గాయాలు

ప్రొద్దుటూరు డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం గ్రామ ఎస్సీ కాలనీలో బుధవారం జెష్టాది జయపాల్ అనే వ్యక్తిపై డేవిడ్, అతని కుమారులు కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం డేవిడ్ తన భార్య పిల్లలతో కలిసి వెళుతుండగా జయపాల్ అవమానకరంగా మాట్లాడాడు. కానీ అదేమి పట్టించుకోకుండా వారు తాళ్లమాపురం నుంచి ప్రొద్దుటూరు టౌన్‌కు వచ్చారు. బుధవారం ఉదయం క్రిస్మస్ సందర్భంగా ఎస్సీ కాలనీలోని స్కూలు వద్ద డేవిడ్ కుమారులు అశోక్, అకిల్ చలిమంటలు వేసుకుంటుంటే అక్కడికి జయపాల్ చేరుకొని మళ్లీ అవమానకరంగా మాట్లాడాడు. ఈ విషయం డేవిడ్‌కు చెప్పడంతో జయపాల్‌ను ఎందుకు ఇలా మాట్లాడుతున్నావని ప్రశ్నించాడు. అతను దురుసుగా మాట్లాడటంతో డేవిడ్ అతని కుమారులు కత్తితో జయపాల్‌పై దాడి చేశారు. దీంతో తీవ్ర రక్తగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. డేవిడ్ అతని కుమారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చిన్నమండెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ జల్లావాండ్లపల్లెకు చెందిన అరమాటి రెడ్డెప్పరెడ్డి (70) రాయచోటిలో నివాసముంటున్నాడు. బుధవారం సాయంత్రం బాహూజీనగర్ కాలనీలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తన ద్విచక్ర వాహనంలో వస్తూ కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై రోడ్డువారి కుర్వపల్లి సమీపంలోని పెట్రోలు బంకు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రెడ్డెప్పరెడ్డికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పశుకిసాన్ కార్డులకు ఆదరణ.. అంతంతే

● అన్నదాతలకు అవగాహన లేక...
● బ్యాంకర్ల సహకారం అందక..
● పాడిరైతులకు దక్కని ప్రయోజనం



ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికే కాదు పాడిసంపదను పోషించడానికి రైతులకు ఎక్కువగా పెట్టుబడి అవుతోంది. పశువుల కొనుగోలుతోపాటు వాటికి గడ్డి, దాణా, మందులు ఇలా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అటు పంటల సాగుకు.. ఇటు పాడిపైన రైతులు పెట్టుబడులు పెట్టడానికి అప్పులు చేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతకు అండగా నిలువడానికి పంటలకు రుణాలు ఇచ్చినట్లే.. పాడిరైతుల కోసం ప్రత్యేకంగా పశుకిసాన్ క్రెడిట్ (పీకేసీ)కార్డులను ప్రభుత్వం జారీ చేస్తోంది. వీటితో వడ్డీ లేకుండా స్వల్పకాలిక రుణాలు పొంది పాడిసంపదను వృద్ధి చేసుకోవడానికి వీలుంటుంది. అయితే పశుకిసాన్ క్రెడిట్ కార్డులకు ఆశించిన ఆదరణ దక్కడం లేదు. పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం చేపడుతున్న పాడి రైతుల బహుళ ప్రయోజనార్థం పశుసంవర్ధకశాఖ అందజేస్తున్న పీకేసీ కార్డులు ప్రచార లోపంతో వారి దరి చేరడం లేదు. పీకేసీ కార్డులపై పాడి రైతులకు అవగాహన లేకపోవడం... బ్యాంకర్ల సహకారం అందించకపోవడంతో పశుసంవర్ధకశాఖ నుంచి కొద్దిమందికే ప్రయోజనం దక్కుతోంది. పీకేసీ కార్డులతో బహుళ ప్రయోజనాలు ఉన్నా అరకొరగా జారీ చేస్తుండడంతో పాడి రైతులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

మూడేళ్లలో 15,584 కార్డులు జారీ

కడప జిల్లాలో పాడిపశువులను నమ్ముకుని జీవనోపాధి పొందే ప్రత్యక్ష, పరోక్ష రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారు. జిల్లాలో 1.80 లక్షల మంది ప్రత్యక్షంగా పాడి కలిగిన రైతులు ఉన్నారు. 3.99 లక్షల గేదెలు, 44 వేల ఆవులు, ఎద్దులు, 3.80 లక్షల మేకలు, 9.20 లక్షల గొర్రెలు, 10 వేల కోళ్లు ఉన్నాయి. జిల్లాలో ఉన్న 17 ప్రాంతీయ పశువైద్యశాలలు, 78 పశువైద్యశాలలు, 224 రైతు భరోసా కేంద్రాల్లో పశుకిసాన్ క్రెడిట్ కార్డులకోసం దరఖాస్తులు అందజేయవచ్చు. అయితే పీకేసీ కార్డులు మాత్రం వందల సంఖ్యలోనే జారీ చేస్తున్నారు. గడిచిన మూడు సంవత్సరాలకు 15,584 కార్డులు మాత్రమే లబ్ధిదారులకు జారీ అయ్యాయి. దీంతో ఈ పథకంపై సర్కారు ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు.

రైతులకు మొండిచెయ్యి

పీకేసీ కార్డుల విషయం చాలా మంది రైతులకు తెలియదు. వాటి ప్రయోజనాలపై సరైన అవగాహన కల్పించడం లేదు. సివిల్‌స్కోర్ లేదని, గతంలో ఇచ్చిన రుణాలు సక్రమంగా చెల్లించలేదని, రుణాలు చెల్లించే స్థోమత ఉంటుందో లేదో.. వంటి అనేక రకాల అభ్యంతరాలతో రైతులకు బ్యాంకర్లు మొండిచేయి చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్ద రైతులు, అవగాహన కలిగిన రైతులు, నాయకులతో సత్సంబంధాలు కలిగిన కొంతమంది రైతులు నేరుగా బ్యాంకులకు దరఖాస్తులు పెట్టుకుని కార్డులు పొంది ప్రయోజనాలు దక్కించుకుంటున్నారు. సామాన్య రైతు అవగాహన రాహిత్యంతో లబ్ధి పొందలేకపోతున్నారు.



పీకేసీ కార్డులతో ఉపయోగాలెన్నో...

● పశుకిసాన్ క్రెడిట్ కార్డులు సాధారణ క్రెడిట్ కార్డులుగా ఉపయోగించుకోవచ్చు. సకాలంలో పాడిపశువుల పోషణకు వనరులు సమకూర్చుకోవచ్చు.

● కార్డు ద్వారా రుణంగా తీసుకున్న సొమ్మును 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. ఆ తర్వాత చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఇందులో 3 శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. నికరంగా రైతుపై నాలుగు శాతం వడ్డీ మాత్రమే పడుతుంది.

● పీకేసీ కార్డుల ద్వారా తీసుకున్న సొమ్మును పాల విక్రయాల ద్వారా తిరిగి చెల్లించుకోవచ్చు. మళ్లీ అవసరం ఉన్నప్పుడు వాడుకోవచ్చు. సక్రమంగా వినియోగించుకుంటే ఎలాంటి వడ్డీ లేకుండా ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు.

అందరూ దరఖాస్తు చేసుకోవచ్చు

పశుసంపద కలిగిన రైతులందరు దరఖాస్తు చేసుకోవచ్చు. పశుసంపద మెయింటినెన్స్ కోసం బ్యాంకర్లు ఈ రుణాలను అందిస్తారు. ఇప్పటి వరకు జారీ అయిన కార్డుల సంఖ్య తక్కువే అయినప్పటికీ వీటి జారీ ప్రక్రియ నిరంతరం సాగుతుంటుంది. బ్యాంకర్లతో నిర్వహించే ప్రతి సమావేశంలో రైతులందరికి కార్డులను జారీ చేయాలని కోరుతూనే ఉన్నాం. గతంలో సహకార బ్యాంకుల్లో ఎక్కువగా కార్డులు జారీ చేసేవారు. ప్రస్తుతం స్టేట్‌బ్యాంకు, ఏపీజీబీ బ్యాంకులు కూడా ఎక్కువగా జారీ చేస్తున్నాయి.

- శారదమ్మ, జేడీ, జిల్లా పశుసంవర్ధకశాఖ

ఉర్దూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమామ్ బాష, సయ్యద్ ఇక్బాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కడప వినాయకనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన రూట 35ఏళ్ల విజయోత్సవంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు జిలానీబాష మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీలు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఉర్దూ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను రెగ్యులర్ చేసి.. అవసరమైన అచార్యుల పోస్టులు మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతమన్నారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర నేతలు సిరాజ్, సత్తార్ ఫైజీ, అసదుల్లా, ముజీబ్ షాహి, నఖిఉల్లా, ఖలందర్ బాష, రఫీబ్, కలీం, ఆచార్యులు డాక్టర్ వసీవుల్లా, డాక్టర్ షాజి యా, సయ్యద్ సలావుద్దీన్, టీడీపీ నేతలు అఫ్సర్‌ఖాన్, మన్సూర్ ఖాన్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు కారుతో ఢీకొట్టి గాయపరిచారు

● ఎస్పీకి టీడీపీ నాయకుల ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రంలో వైసీపీ నాయకులు వాహనాలతో వచ్చి తనను ఢీకొట్టి గాయపరచారని బుధవారం పీటీఎంకు చెందిన టీడీపీ నాయకుడు పాలగిరి రామాంజులు ఆపార్టీ నాయకులతో కలసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం కోర్టు ఆదేశాలతో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు వైసీపీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు తమ వాహనాలలో వచ్చారన్నారు. కాగా తాను గ్రామంలో ఉన్న మంచినీటి సమస్యను మండల సమావేశంలో అధికారులకు విన్నవించేందుకు వెళుతుండగా ఎంపీడీవో కార్యాలయ సమీపంలోకి రాగానే వాహనంతో నామీదకు దొచ్చుకు వచ్చారన్నారు. దీంతో నా కాలికి గాయమై పక్కకు పడిపోవడంతో వారు వాహనాన్ని నిలిపి నాపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులైన మద్దిరెడ్డిపల్లెకు చెందిన పట్టా చంద్ర మోహన్‌రెడ్డి, డి.నారాయణపల్లెకు చెందిన ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు అక్కడికి చేరుకుని వారి నుంచి నన్ను కాపాడారన్నారు. నాపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మంచాలమ్మ ఆలయంలో చోరీ

నందలూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆడపూరు గ్రామంలో ఉన్న మంచాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. 3 వెండి కిరీటాలు, 3 వెండి దీపాలు, ఒక శఠగోపం, 2 వెండి ప్లేట్లు అపహరించారు. ఏఎస్ఐ సుబ్బ రాయుడు మాట్లాడుతూ ఇద్దరి అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాలు



గుడి ఉత్సవంలో ఈశ్వరీదేవి అమ్మవారు... నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మ వారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు వేడుకగా నిర్వ హిస్తున్నారు. నాలుగో రోజు బుధవారం అమ్మవారు ఈశ్వరీదేవి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పుష్ప రథోత్సవంపై ఊరేగింపు నిర్వహించారు. ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కర్ణాటక, బళ్లారి ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నారు. వీరికి మఠాధిపతి వీరకుమారస్వామి షీల్డ్ అందించి అనుగ్రహ పత్రాలు అందించారు. రాత్రి కేవీ సుదర్శనచారి భజన బృందం ఆధ్వర్యంలో జానపద గేయాలు, భజన కార్యక్రమాలు అలరించాయి. మూడురోజుల నుంచి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మఠం ఈవో జగన్మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పించారు.

ప్రమాద బీమా రూ.1.90కోట్లు అందజేత

వేంపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొద్ది నెలల కిందట ప్రమాదవశాత్తు వంకలో పడి మృతి చెందిన జర్రిపీటి రాజ కుటుంబానికి రూ.1.90 కోట్లు బీమా మొత్తం మంజూరైంది. టాటాలైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రాజ పాలసీ చేసి ఉన్నాడు. ఇతను ప్రమాదవశాత్తు మృతిచెందడంతో బీమా మంజూరు కోసం వేంపల్లె వాసి శివ ఉమేష్‌రెడ్డి సంబంధిత డాక్యుమెంట్లు సంస్థకు అందించి రూ.1.90 కోట్లు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నారు. చెక్కును టాటా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కడప బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్, సీనియర్ లీడర్ నాగమల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేంద్రారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో అడ్వైజర్లు భరణి, రవితేజ పాల్గొన్నారు.




జర్రిపీటి రాజ కుటుంబానికి చెక్కును అందిస్తున్న దృశ్యం

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

రాయచోటిటౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అమరావతి వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్ కందూరు శ్రీనివాసరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఓపెన్ స్కూల్స్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందాలనుకునే అభ్యాసకులు ఈ నెల 26 నుంచి 31వ తేదీలోగా తత్కాల్ కింద రూ.600 ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యాసకులు సమీపంలోని ఏపీవో ఎస్ఎస్ స్టడీ సెంటర్‌లో గానీ, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గానీ సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

రాజకీయ రారాజు వీరారెడ్డికి ఘననివాళులు



వీరారెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎల్ఎస్‌పీ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, ఏఓ మన్యం సుధాకర్‌రెడ్డి

బద్వేలుటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుబాంధవుడు, రాజకీయ దురంధరుడు, రాజకీయరారాజు, దివంగత మంత్రి బిజివేముల వీరారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా బుధవారం వీరారెడ్డి ఘాట్ వద్ద కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న, ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రైల్వేకాంట్రాక్టర్ ఎం.సూర్యనారాయణరెడ్డి, బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, రైల్వేకాంట్రాక్టర్ శ్రీనివాసులు, ఎల్ఎస్‌పీ కమిటీ చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డి, బొమ్మన సుబ్బరాయుడు, ఈగ సుబ్బారెడ్డి, ఈగ సుమన్‌రెడ్డి, ఎస్‌బీవీఆర్ కళాశాల ఏఓ మన్యం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మణ్యం రామిరెడ్డి, ఏసియన్ కేబుల్ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్, కౌన్సిలర్ రాగిమాను రవితేజ, బోవిళ్ల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ భైసాని ప్రతాప్‌రెడ్డి, యారవ సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, సాదనకారి రంతు, సీతా వెంకటసుబ్బయ్య, సీతా బాలాజీ, ఇమామ్ హుస్సేన్, హబీబున్నీసా, పుల్లప్ప నాయుడు, కొండారామక్రిష్టారెడ్డి, శెట్యం ప్రతాప్, వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, కనుమర్లపూడి ప్రసాద్, మస్తాన్‌బాబు, షేక్ మన్సూర్, జహంగీర్‌బాషా, మద్దిరెడ్డి, వెంగళ శ్రీనివాసులరెడ్డి, చెరకూరి చెన్నరాయుడు, మాచుపల్లె లక్ష్మీదేవి, మిత్తికాయల సునీత, ఝాన్సీ, క్రిష్టారెడ్డి తదితరులు ఆయన ఘాట్‌వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రేవంత్‌రెడ్డితో మండిపల్లి భేటీ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలిసి ఉచిత బస్సు పథకం పై చర్చించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు భద్రత, సురక్షితమైన ప్రయాణం అందిస్తున్నందుకు అభినందించారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్నమండ్ల భక్తవత్సలం

రాయచోటి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త, మండ్ల భక్తవత్సలం తన భార్య రమాదేవి 69వ జయంతి సందర్భంగా బుధవారం 250 మంది పేద మహిళలు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు రెడ్డిరూపేశ్, కోడలు పావతి, దాతృత్, జోష్టితి, శ్రావ్య, మంజునాథ్, ఈశ్వరయ్య, శశిధర్, జగదీశ్, ధనాంజి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న కాటమరాజు ఆలయాలు



ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న గ్రామస్తులు

సంబేపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా అందరికీ గుర్తొచ్చే దేవుడు కాటమరాజు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల్లో కాటమ రాయుడి ఆలయాలు ముస్తాబు చేయడం, పశువులను అలంకరించి కాటమ రాయుడి ఆలయం చుట్టూ తిప్పడం, అనంతరం భోగి మంటల నడుమ పశువులను బెదిరి స్తారు. ఇందుకోసం దుద్యాల పెద్దజంగంప ల్లిలో కాటమరాజు ఆలయం నిర్మిస్తున్నారు.

కనిపించకుండా పోయిన వృద్ధుడి మృతదేహం లభ్యం

రామాపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయం నుంచి వెంకటరెడ్డి అనే వ్యక్తి కనిపించడం లేదని ఇటీవల ఆయన భార్య రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. అయితే, బుధవారం ప్రేమాలయం ఎదురుగా ఆయన మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరికి తీవ్ర గాయాలు

సిద్దవటం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసుల కథనం మేరకు తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న కారు మిట్టపల్లి సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న వెంకటయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరంతా తిరుపతిలోని ఆటోనగర్‌కు ఒకే కుటుంబ సభ్యులని తెలిపారు

ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తి చేయరా?

- అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణ పనులు
- గదులు చాలక విద్యార్థినులు, ఉపాధ్యాయుల అవస్థలు
- ల్యాబ్‌కెళ్లాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సిందే..
- కేజీబీవీ విద్యార్థినుల ఆవేదన



అర్ధాంతరంగా ఆగిన కేజీబీవీ జూనియర్ కళాశాల భవనం పనులు

సుండుపల్లె, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా కళాశాల భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో కస్తూరిబాగాంధీ విద్యాలయం విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. సుండుపల్లె మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని అక్కంపల్లి సమీపంలో మల్లు శివారెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఐదెకరాల భూమిలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ భవనం నిర్మించారు. ఆ భవనంలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు 250 మంది , ఇంటర్మీడియట్‌లో 67 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఈ విద్యాలయం పక్కనే జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం 20 19లో అనుమతులతో పాటు రూ.1.60 కోట్లు నిధులు కేటాయించడంతో, 2020లో పనులు ప్రారంభమయ్యాయి. అయితే, ఆ పనులు ప్రారంభించి ఇప్పటికి నాలుగేళ్లు గడుస్తున్నా నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. దీంతో పాఠశాల, కళాశాల తరగతులు రెండింటినీ పాత భవనంలోనే నిర్వహిస్తున్నారు. దీంతో గదులు చాలక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తగిన వసతులు లేవన్న ఉద్దేశంతో పలువురు విద్యార్థినులు ఇతర కళాశాలలకు వెళ్లి పోయారు. అలాంటి అవకాశం లేని విద్యార్థినులు మాత్రం అదే భవనంలో ఇబ్బందులు పడుతూ సర్దుకుంటున్నారు. పనులు ఆగిపోయి నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు కానీ, పాలకులు కానీ , ఈ భవనాల విషయం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా సబంధిత అధి కారులు చొరవ చూపి కళాశాల నూతన భవనం నిర్మాణా లు పూర్తి చేసి మెరుగైన వసతులను కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కేజీబీవీ పాఠశాల భవనం

వేధిస్తున్న గదుల కొరత

నూతన భవనాల నిర్మాణం పూర్తి కాకపోగా, తరగతి గదులు, వసతి గృహాలు, ల్యాబ్‌లు, అధ్యాపకుల గదులు లేకుండానే ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అనుమతులు ఇవ్వడం, విద్యార్థులను కష్టాలపాలు చేస్తోంది. వసతి గృహంలో ఉన్న గదులు పాఠశాల విద్యార్థులకే సరిపోక ఇబ్బందులు పడుతుండగా, ఇంటర్మీడియట్ విద్యార్థినులు కూడా ఆ గదుల్లోనే తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. .

ప్రైవేటు కళాశాలలో ప్రయోగశాలలు

కస్తూరిబా కళాశాలలో ప్రయోగశాలలు లేకపోవడంతో విద్యార్థినులు సుండుపల్లె లోని ఓ ప్రైవేటు కళాశాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. .

> **వారంలోపు టెండర్లు**
>
> కరోనా సమయంలో కాంట్రాక్టర్ పనులు చేశారు. ఆ తర్వాత అర్ధాంతరంగా పనులు ఆపేశారు. బేస్‌మెంట్ వరకు పనులు జరిగాయి. వారం రోజుల్లో ప్రభుత్వం కొత్త టెండర్లు ఆహ్వానిస్తోంది. టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభించి, పూర్తి చేస్తాం.
>
> - మురళి, జిల్లా సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ప్రార్థనలతో మార్మోగిన క్రైస్తవ మందిరాలు



రాయచోటిలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో సందేశం ఇస్తున్న ఫాదర్ శుభకర్, ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రాయచోటిటౌన్, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా రాయచోటి పట్టణంలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ ఎస్ఎస్‌జీ శుభకర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బేతల్‌కాలనీ కొత్తపేటలో చర్చి, దిగువ అబ్బవరం, శిబ్యాల, యండపల్లి తదితర ప్రాంతాల్లో వేడుకలు చేసుకున్నారు. ఈసందర్భంగా టీడీపీ నేత మడితాటి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ క్రీస్తు బోధనలు, కార్యాచరణ ప్రపంచ మానవాళిని ఎంతగానో ప్రభావితం చేశాయన్నారు. ఈ వేడుకల్లో రాయుడుకాలనీ టీడీపీ నాయకులు రంజిత్‌రాయల్, సయ్యద్ ఫైనుద్దీన్, సేహేల్, సమీర్, ఇర్ఫాన్, మహమ్మద్, ఇర్షాద్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): మండలంలోని దక్షిణాంధ్ర లూథరన్ చర్చి, ఎస్కోలు, హోసన్న తదితర చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ పట్టణంలోని లూథరన్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని క్రైస్తవులకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చి పాస్టర్ బాబు, సంఘం చైర్మన్ పాలెం భాను, సభ్యులు వెంకటరమణ(సునీల్) తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ఏసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకొని మండలంలోని అందెలపల్లె చర్చి, మద్దిరేవుల సింగరాజుగారిపల్లె, లక్కిరెడ్డిపల్లె మిస్పా, పేతురు, లూథరన్, సెయింట్ జాన్, దప్పేల్లి, చింతకుంటవాండ్లపల్లి చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

పెనగలూరు: మండలంలోని ఎం.సిద్దవరం, తిరుమలరాజుపేట, అనంతంపల్లె, ఉప్పరపల్లె, తిరుణంపల్లె గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గాలివీడు: పట్టణంలోని కార్మెల్ ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రత్నం, జయన్న, విశ్వాసులు పాల్గొన్నారు.

వీరబల్లి: క్రీస్తు జీవనం ఆచరణీయమని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. వీఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో స్థానిక చర్చిలో కేక్‌కట్ చేశారు.

సిద్దవటం: కడప - చెన్నై జాతీయ రహదారిలోని నిర్మలగిరికాలనీ వద్ద ఉన్న చర్చిలో ఫాదర్ నెల్సన్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా సంఘమిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్ మాట్లాడుతూ చర్చికి కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి 50 వేల రూపాయలు ఇస్తామని తెలియజేశారు. క్రైస్తవ మహిళలకు 300 చీరలు పంపిణీ చేశారు.

అజాత శత్రువు అటల్ బిహారీ వాజ్‌పేయీ



వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న ఎన్డీయే నాయకులు

రాజంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అజాత శత్రువు అటల్‌బిహారీ వాజ్‌పేయీ అని బీజేపీ నేతలు ప్రస్తుతించారు. మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయీ శత జయంతి సందర్భంగా బుధవారం స్థానిక పాతబస్టాండు కూడలిలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, జనసేన పార్లమెంట్ నాయకుడు శ్రీని వాసరాజు మాట్లాడుతూ భారతజాతికి శాంతి మంత్రమే కాదు.. యుద్ధ తంత్రం కూడా తెలుసునని నిరూపించిన నాయకుడన్నారు. తన జీవితాన్ని భారతమాత సేవకై అంకితమిచ్చిన దేశభక్తుడని కొనియాడారు. శత్రువుల చేత కూడా శభాష్ అనిపించుకున్న అజాత శత్రువు అన్నారు. అఖండ భారత కోసం కలలు కన్న దార్శనికుడని తన కవిత్వంతో జాతి ఊపిరిలో నిత్యం నిలిచిన అమరుడన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బనరసయ్య, బీజేపీ నాయకుడు పి.నాగేశ్వరరావు, టి.కృష్ణ, టి.హరిప్రసాద్, సురేష్‌రాజు, సునీత నారాయణవర్మ, షబ్బీర్ అహ్మద్, హిమగిరి, గుణవర్మ, చంద్రరాజు, కళ్యాణ్, సూర్యచంద్ర, వీవీ రమణ, రమణారెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, పప్పుశెట్టి సుబ్రమణ్యం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు రూరల్: బీజేపీ నాయకుడు వాకచర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ కార్యాలయంలో నివాళులర్పించారు. సీనియర్ నాయకులు చెంగల్‌రెడ్డి, ఊటుకూరు చలపతి, బత్తల సుబ్రహ్మణ్యం, శంకర్ రాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: బీజేపీ నాయకులు జయరామచంద్రనాయుడు, రామచంద్రయ్య , కృష్ణ తదితరులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రాజంపేట టౌన్: రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్య క్షుడు ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ కార్యాలయంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్‌తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని ఆర్ అండ్ బి బంగ్లా సమీపంలో రాష్ట్ర బీజేపీ కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, మైనార్టీమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, సురేష్‌రాజు తదితరులు నివాళులర్పించారు

ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

పెనగలూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పెనగలూరు ఏఎస్‌ఐ రాముడు ప్రజలకు సూచించారు. పోలీసుస్టేషన్ ఆవరణలో ఈ విషయంపై స్థానికులకు అవగాహన కల్పించారు. బైకు, స్కూటీ మోపెడ్ వాహనాలపై ప్రయాణించే రైడర్లు తమ కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని హెల్మెట్ ధరించి వాహనాలను అతి జాగ్రత్తగా నడపాలని కోరారు. అనంతరం కంబాలకుంట వరకు హెల్మెట్ ధరించి బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, పీసీలు రామరాజు, మల్లికార్జున, సుజిత, శివనాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో అన్నదానం

చిన్నమండెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు గ్రామ పంచా యతీ ఎగువ హరిజనవాడ కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ సంద ర్భంగా బుధవారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బయ్యారెడ్డి ఆ. ధ్వర్యంలో అన్నదానం చేశారు. గురువారం సీతారాముల కల్యాణోత్సవం ఉందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున గ్రామస్తులు హాజరయ్యారు.

కోదండ రామాలయం వెనుక స్థలాల ఆక్రమణ

ఒంటిమిట్ట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండ రామాలయం వెనుక భాగంలోని స్థలాలను ఆక్రమించడంలో భాగంగా కొందరు వ్యక్తులు ఆ ప్రాంతాల్లో బంకులు ఏర్పాటు చేస్తున్నారు. కొద్దిరోజులుగా ఈ తతంగం నడుస్తున్నా పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో బుధవారం క్రిస్మస్ సందర్భంగా సెలవు కావడంతో మరికొంతమంది బంకులను ఏర్పాటు చేసుకున్నారు. ఇంకా పలువురు ఆక్రమణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో రామాలయానికి వచ్చే భక్తుల పార్కింగ్, అన్నదాన వితరణకు ఉపయోగపడే స్థలాలను ఆక్రమించినా స్థానిక అధికారులు గాని, మండల అధికారులుగాని పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై పంచాయతీ సెక్రటరి సుధాకర్‌ను వివరణ కోరగా తాము ఆయా బంకుల యజమానులను హెచ్చరించినా, ఆక్రమణలు మానుకోవడం లేదని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

'బోగస్ సర్టిఫికెట్లను అందల మెక్కించిన ప్రభుత్వం'

రాయచోటిటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బోగస్ సర్టిఫికెట్లు ఉన్న అభ్యర్థులకే ప్రభుత్వం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ఉద్యోగా లిచ్చిందని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపిం చారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విచక్షణతో ఆలోచించి ప్రభుత్వ సంస్థ ల్లో శిక్షణ పొంది కాంట్రాక్టు ఉద్యోగం సంపాదించి, 22 ఏళ్లపాటు సేవలందించిన మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (మేల్)ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ పబ్లిక్ హెల్త్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ పాటించని బోగస్ సంస్థల సర్టిఫికెట్లనుచి ఏరివేయాలని, అందుకు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గిరిజనుల దారి సమస్య పరిష్కారం...



గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేస్తున్న సీఐటీయూ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.వి.కండ్రిక గ్రామంలోని గిరిజనుల భూములకు దారి సమస్యను బుధవారం సీఐటీయూ నాయకులు పరిష్కరించారు. మూడేళ్ల క్రితం ఈ దారి కబ్జా కాగా, సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించడంతో 15 అడుగుల మేర దారి వదలాలని కబ్జాదారులను అప్పటి తహసీల్దార్ శిరీష హెచ్చరించారు. అప్పట్లో దారిని కల్పిస్తామని చెప్పిన కబ్జాదారులు మళ్లీ ఆక్రమణకు యత్నిస్తున్నట్లు సమాచారం రావడంతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ మణి ఆధ్వర్యంలో గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకుఆటంకం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

గ్రామ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మద్దిరేవుల సింగరాజుగారిపల్లె, నందివాళ్లపల్లె, రెడ్డివారిపల్లెల్లో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో రూ.1.40 కోట్లతో సీసీ రోడ్డు ఏర్పాటు చేశామని, తాగునీటి సమస్య నివారణకు కోటి రూపాయలకుపైగా ఖర్చు పెట్టామన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో ని మారుమూల ప్రాంతాల్లో సైతం రోడ్ల ఏర్పాటుకు మంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్ మోహన్, రవీంద్రరాజు, యువకులు పాల్గొన్నారు.

కళాకారుడి హత్యపై హక్కుల నేతల విచారణ

గాలివీడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కళాకారుడు మల్లెల వెంకట్రమణ (25) హత్య ఘటనపై ప్రజాస్వామ్యహక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టీ. ఈశ్వర్ నేతృత్వంలో నిజనిర్ధారణకమిటీ సభ్యులు హత్యా స్థలాన్ని సందర్శించారు. ప్రత్యక్ష సాక్షులను గ్రామస్తులను విచారణ చేసి హత్యకు కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హక్కుల నేతల ఈశ్వర్ విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంఘటనపై లక్కిరెడ్డిపల్లె సీఐని పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్‌ను డీఎస్పీ కృష్ణమోహన్‌ను విచారించాల్సి ఉందని తెలియజేశారు. కాగా, డీఎస్పీ , సీఐలు బుధవారం మరోసారి హత్యా స్థలాన్ని పరిశీలించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న విడ్స్ సంస్థ ప్రతినిధులు

ఓబులవారిపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యత సాధనకు కృషి చేస్తున్నామని విడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రతాప్, శ్రీహరి తెలిపారు. బుధవారం వారు స్థానికులకు జీరో అకౌంట్, సుకన్య సమృద్ధి యోజన పథకం, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై, ఎన్‌పీఎస్ వాత్సల్య , పసల్ బీమా యోజన వంటి పథకాలపై అవగాహన కల్పించారు. ప్రైవేటు సంస్థల ద్వారా రుణాలు, సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రిజర్వు బ్యాంకు చేసిన సూచనలను, సలహాలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ప్రతాప్, శ్రీహరి, ఏపీజీబీ బీసీ ఈశ్వరయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి



ఏపీ రైతు సంఘం మహాసభలో మాట్లాడుతున్న వంగిమళ్ల రంగారెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటి పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ మహాసభలో ఆయన మాట్లాడారు. రైతు లందరూ ఏపీ రైతు సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. వ్యవ సాయ రుణాలన్నీ మాఫీ చేసి కొత్తగా రుణాలు ఇవ్వాలని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వెలిగల్లు ప్రాజెక్టు కాలువల పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసిం హులు, ఏరియా కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకేపాటి ఆధ్వర్యంలో 28న జాబ్‌మేళా

రాజంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్ అండ్ టి కంపెనీ వారు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాజంపేట న్యాక్ సెంటర్ ఇన్‌చార్జి జి.శంకరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాబ్‌మేళాను ఐటీఐ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, ప్లంబింగ్, వెల్డింగ్, కార్పెంటర్, ఇంటర్, పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు కాంచీపురంలో 3 నెలల పాటు శిక్షణ ఇస్తారని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం కల్పిస్తారన్నారు. ఈ ట్రైనింగ్ పూర్తయిన తర్వాత ఎల్ అండ్ టి కంపెనీవారు, అమరావతి వైజాగ్, హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు నగరాల్లో ఉపాధి కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7989733065 పి.మారుతిరావు, పీఏ టు ఎమ్మెల్యే, 9492532257, డి.కాంతారావు 8247035161 ఎల్ అండ్ టి కంపెనీ చెన్నై నంబర్లలో సంప్రదించాలన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు,

రాజంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : లయన్ విజయ్ కుమార్ రాజు తల్లిదండ్రులు కొండూరు రెడ్డి రాజు, . ధనలక్ష్మి జ్ఞాపకార్థం స్థానిక బాల సదన్ పాఠశాలలోని విద్యార్థులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు, జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, క్లబ్ ఉపాధ్యక్షుడు మలిశెట్టి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పాతబస్టాండులో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ బాబు వెంకటరమణ, జోన్ చైర్మన్ వై.సుబ్రమణ్యంరాజు, సీనియర్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, ఎం.రామకృష్ణ నాయుడు, నాగేశ్వరరావు, నాసరుద్దీన్, క్లబ్ కోశాధికారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

సిద్దవటం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఉమ్మడి కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండలంలోని మాధవరం-1 గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ చేనేత సహకార సంఘం సభ్యులు బుధవారం ఆయన స్వగృహంలో కలసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేనేత సమస్యలపై త్వరలో ఒక నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, సంఘం జాయింట్ ప్రెసిడెంట్ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడి హత్య కేసును నీరుగారుస్తున్న సీఐ

● డీఎస్పీ కృష్ణమోహన్‌కు హక్కుల నేతల ఫిర్యాదు



డీఎస్పీ కృష్ణమోహన్‌కు వివరాలు తెలియజేస్తున్న హక్కుల నేతలు

రాయచోటి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లె వద్ద ఈనెల 23న జరిగిన మల్లెల వెంకట్రమణ (25) హత్యకేసును లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి నీరు గార్చే ప్రయత్నంలో ఉన్నాడని, ఈ కేసు విచారణ బాధ్యతల నుంచి ఆయనను తప్పించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్, నిజనిర్ధారణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం వారు బోరెడ్డిగారిపల్లెను సందర్శించి స్థానికులను, ప్రత్యక్ష సాక్షులను, పోలీసులను విచారించిన అనంతరం రాయచోటిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కేసును సరైన పద్ధతిలో విచారణ చేయకుండా సీఐ నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇప్పటి వరకు చేసిన దర్యాప్తులోని లోపాలను డీఎస్పీ కృష్ణమోహన్‌కు వివరించినట్లు తెలియజేశారు. ఈ కేసులో రమణారెడ్డితో పాటు మరో ఇద్దరు పాల్గొన్నట్లు తెలుస్తోందన్నారు. సీఐ మాత్రం రమణారెడ్డి పేరును మాత్రమే ఎఫ్ఐఆర్‌లో చేర్చడం, విచారణలో జాప్యం చేయడం, బాధితులనే బెదిరిస్తుండడంతో ఈకేసు విచారణ సవ్యంగా జరుగుతుందనే నమ్మకం లేకుండా పోయిందన్నారు. వెంటనే సీఐ కొండారెడ్డిని విచారణ బాధ్యతల నుంచి తప్పించి మరొక అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, మారుతీశంకర్, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ మునీర్‌పై దాడి కేసు నమోదు

ప్రొద్దుటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ మునీర్ అతని సోదరుడు బషీర్‌పై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో దాడి కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. కౌన్సిలర్ మునీర్ సోదరుడు బషీర్ గ్రీన్‌ల్యాండ్‌కు చెందిన మహ్మద్ హుస్సేన్ అనే వ్యక్తికి డబ్బులు బాకీ వున్నాడు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 23న గ్రీన్‌ల్యాండ్‌లో గొడవ జరిగింది. దీంతో కౌన్సిలర్ మునీర్ తనపై దాడి చేశారని మహ్మద్ హుస్సేన్ మరో నలుగురిపై రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టాడు. ఇదిలావుండగా బుధవారం ఉదయం జిన్నారోడ్డులో తాను నిలబడివుండగా కౌన్సిలర్ మునీర్, అతని సోదరుడు బషీర్‌లు వచ్చి తనపై దాడి చేశారని మహ్మద్ హుస్సేన్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు విచారించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎల్ఐసీ ఆఫీసు వద్ద ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని, రాత్రి నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించామని.. ఇతర వివరాలకు 9121100511కు ఫోను చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు.

మురుగుకాల్వలో పడి మహిళ మృతి



కడప క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మోచంపేట కాల్వ వద్ద బుధవారం ఓ మహిళకు ఫిట్స్ రావడంతో కాలువలో పడి మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమరనాథరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మోచంపేటకు చెందిన విజయకుమారి (33) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో పాటు ఫిట్స్‌తో బాధపడుతుండేది. ఆమెకు భర్త నాగేశ్వర్‌రావు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం నడుచుకుంటూ వెళుతుండగా.. ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న మురుగుకాల్వలో పడి పోయింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో కాల్వలోనే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. మృతురాలు సోదరుడు సంజీవ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి.. తీవ్ర గాయాలు

ప్రొద్దుటూరు డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం గ్రామ ఎస్సీ కాలనీలో బుధవారం జెష్టాది జయపాల్ అనే వ్యక్తిపై డేవిడ్, అతని కుమారులు కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం డేవిడ్ తన భార్య పిల్లలతో కలిసి వెళుతుండగా జయపాల్ అవమానకరంగా మాట్లాడాడు. కానీ అదేమి పట్టించుకోకుండా వారు తాళ్లమాపురం నుంచి ప్రొద్దుటూరు టౌన్‌కు వచ్చారు. బుధవారం ఉదయం క్రిస్మస్ సందర్భంగా ఎస్సీ కాలనీలోని స్కూలు వద్ద డేవిడ్ కుమారులు అశోక్, అకిల్ చలిమంటలు వేసుకుంటుంటే అక్కడికి జయపాల్ చేరుకొని మళ్లీ అవమానకరంగా మాట్లాడాడు. ఈ విషయం డేవిడ్‌కు చెప్పడంతో జయపాల్‌ను ఎందుకు ఇలా మాట్లాడుతున్నావని ప్రశ్నించాడు. అతను దురుసుగా మాట్లాడటంతో డేవిడ్ అతని కుమారులు కత్తితో జయపాల్‌పై దాడి చేశారు. దీంతో తీవ్ర రక్తగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. డేవిడ్ అతని కుమారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చిన్నమండెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ జల్లావాండ్లపల్లెకు చెందిన అరమాటి రెడ్డెప్పరెడ్డి (70) రాయచోటిలో నివాసముంటున్నాడు. బుధవారం సాయంత్రం బాహూజీనగర్ కాలనీలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తన ద్విచక్ర వాహనంలో వస్తూ కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై రోడ్డువారి కుర్వ పల్లి సమీపంలోని పెట్రోలు బంకు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రెడ్డెప్పరెడ్డికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పశుకిసాన్ కార్డులకు ఆదరణ.. అంతంతే

● అన్నదాతలకు అవగాహన లేక...
● బ్యాంకర్ల సహకారం అందక..
● పాడిరైతులకు దక్కని ప్రయోజనం



ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికే కాదు పాడిసంపదను పోషించడానికి రైతులకు ఎక్కువగా పెట్టుబడి అవుతోంది. పశువుల కొనుగోలుతోపాటు వాటికి గడ్డి, దాణా, మందులు ఇలా ఖర్చులు తడిసి మోపెడవుతు న్నాయి. అటు పంటల సాగుకు.. ఇటు పాడిపైన రైతులు పెట్టుబడులు పెట్టడానికి అప్పులు చేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతకు అండగా నిలువడానికి పంటలకు రుణాలు ఇచ్చినట్లే.. పాడిరైతుల కోసం ప్రత్యేకంగా పశుకిసాన్ క్రెడిట్ (పీకేసీ)కార్డులను ప్రభుత్వం జారీ చేస్తోంది. వీటితో వడ్డీ లేకుండా స్వల్పకాలిక రుణాలు పొంది పాడిసంపదను వృద్ధి చేసుకోవడానికి వీలుంటుంది. అయితే పశుకిసాన్ క్రెడిట్ కార్డులకు ఆశించిన ఆదరణ దక్కడం లేదు. పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం చేపడుతున్న పాడి రైతుల బహుళ ప్రయోజనార్థం పశుసంవర్ధకశాఖ అందజేస్తున్న పీకేసీ కార్డులు ప్రచార లోపంతో వారి దరి చేరడం లేదు. పీకేసీ కార్డులపై పాడి రైతులకు అవగాహన లేకపోవడం... బ్యాంకర్ల సహకారం అందించకపోవడంతో పశుసంవర్ధకశాఖ నుంచి కొద్దిమందికే ప్రయోజనం దక్కుతోంది. పీకేసీ కార్డులతో బహుళ ప్రయోజనాలు ఉన్నా అరకొరగా జారీ చేస్తుండడంతో పాడి రైతులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

మూడేళ్లలో 15,584 కార్డులు జారీ

కడప జిల్లాలో పాడిపశువులను నమ్ముకుని జీవనోపాధి పొందే ప్రత్యక్ష, పరోక్ష రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారు. జిల్లాలో 1.80 లక్షల మంది ప్రత్యక్షంగా పాడి కలిగిన రైతులు ఉన్నారు. 3.99 లక్షల గేదెలు, 44 వేల ఆవులు, ఎద్దులు, 3.80 లక్షల మేకలు, 9.20 లక్షల గొర్రెలు, 10 వేల కోళ్లు ఉన్నాయి. జిల్లాలో ఉన్న 17 ప్రాంతీయ పశువైద్యశాలలు, 78 పశువైద్యశాలలు, 224 రైతు భరోసా కేంద్రాల్లో పశుకిసాన్ క్రెడిట్ కార్డులకోసం దరఖాస్తులు అందజేయవచ్చు. అయితే పీకేసీ కార్డులు మాత్రం వందల సంఖ్యలోనే జారీ చేస్తున్నారు. గడిచిన మూడు సంవత్సరాలకు 15,584 కార్డులు మాత్రమే లబ్ధిదారులకు జారీ అయ్యాయి. దీంతో ఈ పథకంపై సర్కారు ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు.

రైతులకు మొండిచెయ్యి

పీకేసీ కార్డుల విషయం చాలా మంది రైతులకు తెలియదు. వాటి ప్రయోజనాలపై సరైన అవగాహన కల్పించడం లేదు. సివిల్‌స్కోర్ లేదని, గతంలో ఇచ్చిన రుణాలు సక్రమంగా చెల్లించలేదని, రుణాలు చెల్లించే స్థోమత ఉంటుందో లేదో.. వంటి అనేక రకాల అభ్యంతరాలతో రైతులకు బ్యాంకర్లు మొండిచేయి చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్ద రైతులు, అవగాహన కలిగిన రైతులు, నాయకులతో సత్సంబంధాలు కలిగిన కొంతమంది రైతులు నేరుగా బ్యాంకులకు దరఖాస్తులు పెట్టుకుని కార్డులు పొంది ప్రయోజనాలు దక్కించుకుంటున్నారు. సామాన్య రైతు అవగాహన రాహిత్యంతో లబ్ధి పొందలేకపోతున్నారు.



పీకేసీ కార్డులతో ఉపయోగాలెన్నో...

● పశుకిసాన్ క్రెడిట్ కార్డులు సాధారణ క్రెడిట్ కార్డులుగా ఉపయోగించుకోవచ్చు. సకాలంలో పాడిపశువుల పోషణకు వనరులు సమకూర్చుకోవచ్చు.

● కార్డు ద్వారా రుణంగా తీసుకున్న సొమ్మును 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. ఆ తర్వాత చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఇందులో 3 శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. నికరంగా రైతుపై నాలుగు శాతం వడ్డీ మాత్రమే పడుతుంది.

● పీకేసీ కార్డుల ద్వారా తీసుకున్న సొమ్మును పాల విక్రయాల ద్వారా తిరిగి చెల్లించుకోవచ్చు. మళ్లీ అవసరం ఉన్నప్పుడు వాడుకోవచ్చు. సక్రమంగా వినియోగించుకుంటే ఎలాంటి వడ్డీ లేకుండా ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు.

అందరూ దరఖాస్తు చేసుకోవచ్చు

పశుసంపద కలిగిన రైతులందరు దరఖాస్తు చేసుకోవచ్చు. పశుసంపద మెయింటెనెన్స్ కోసం బ్యాంకర్లు ఈ రుణాలను అందిస్తారు. ఇప్పటి వరకు జారీ అయిన కార్డుల సంఖ్య తక్కువే అయినప్పటికీ వీటి జారీ ప్రక్రియ నిరంతరం సాగుతుంటుంది. బ్యాంకర్లతో నిర్వహించే ప్రతి సమావేశంలో రైతులందరికి కార్డులను జారీ చేయాలని కోరుతూనే ఉన్నాం. గతంలో సహకార బ్యాంకుల్లో ఎక్కువగా కార్డులు జారీ చేసేవారు. ప్రస్తుతం స్టేట్‌బ్యాంకు, ఏపీజీబీ బ్యాంకులు కూడా ఎక్కువగా జారీ చేస్తున్నాయి.

- శారదమ్మ, జేడీ, జిల్లా పశుసంవర్ధకశాఖ

ఉర్దూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమామ్ బాష, సయ్యద్ ఇక్బాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కడప వినాయకనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన రూట 35ఏళ్ల విజయోత్సవంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు జిలానీబాష మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీలు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఉర్దూ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను రెగ్యులర్ చేసి.. అవసరమైన అచార్యుల పోస్టులు మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళాతమన్నారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర నేతలు సిరాజ్, సత్తార్ ఫైజీ, అసదుల్లా, ముజీబ్ షాహి, నఖీఉల్లా, ఖలందర్ బాష, రఖీబ్, కలీం, ఆచార్యులు డాక్టర్ వసీవుల్లా, డాక్టర్ షాజి యా, సయ్యద్ సలావుద్దీన్, టీడీపీ నేతలు అఫ్సర్‌ఖాన్, మన్సూర్ ఖాన్ ఎస్డీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాలు



గుడి ఉత్సవంలో ఈశ్వరీదేవి అమ్మవారు... నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మ వారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు వేడుకగా నిర్వ హిస్తున్నారు. నాలుగో రోజు బుధవారం అమ్మవారు ఈశ్వరీదేవి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పుష్ప రథోత్సవంపై ఊరేగింపు నిర్వహించారు. ఆరాధన గురుపూజా మహోత్సవాల సంద ర్భంగా ఆలయ ప్రాంగణంలో కర్ణాటక, బళ్లారి ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నారు. వీరికి మఠాధిపతి వీరకుమారస్వామి షీల్డ్ అందించి అనుగ్రహ పత్రాలు అందించారు. రాత్రి కేవీ సుదర్శనచారి భజన బృందం ఆధ్వర్యంలో జానపద గేయాలు, భజన కార్యక్రమాలు అలరించాయి. మూడురోజుల నుంచి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మఠం ఈవో జగన్మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పించారు.

ప్రమాద బీమా రూ.1.90కోట్లు అందజేత



జర్రిపీటి రాజ కుటుంబానికి చెక్కును అందిస్తున్న దృశ్యం

వేంపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొద్ది నెలల కిందట ప్రమాదవశాత్తు వంకలో పడి మృతి చెందిన జర్రిపీటి రాజ కుటుంబానికి రూ.1.90 కోట్లు బీమా మొత్తం మంజూరైంది. టాటాలైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రాజ పాలసీ చేసి ఉన్నాడు. ఇతను ప్రమాదవశాత్తు మృతిచెందడంతో బీమా మంజూరు కోసం వేంపల్లె వాసి శివ ఉమేష్‌రెడ్డి సంబంధిత డాక్యుమెంట్లు సంస్థకు అందించి రూ.1.90 కోట్లు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నారు. చెక్కును టాటా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కడప బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్, సీనియర్ లీడర్ నాగమల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేంద్రారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో అడ్వైజర్లు భరణి, రవితేజ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

రాయచోటిటౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అమరావతి వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఓపెన్ స్కూల్స్ అన్నయ్య జిల్లా కోఆర్డినేటర్ కందూరు శ్రీనివాసరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఓపెన్ స్కూల్స్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందాలనుకునే అభ్యాసకులు ఈ నెల 26 నుంచి 31వ తేదీలోగా తత్కాల్ కింద రూ.600 ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యాసకులు సమీపంలోని ఏపీవో ఎస్ఎస్ స్టడీ సెంటర్‌లో గానీ, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గానీ సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

రాజకీయ రారాజు వీరారెడ్డికి ఘననివాళులు



వీరారెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎల్ఎస్‌పీ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, ఏఓ మన్యం సుధాకర్‌రెడ్డి

బద్వేలుటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతుబాంధవుడు, రాజకీయ దురందరుడు, రాజకీయరారాజు, దివంగత మంత్రి బిజివేముల వీరారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా బుధవారం వీరారెడ్డి ఘాట్ వద్ద కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న, ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రైల్వేకాంట్రాక్టర్ ఎం.సూర్యనారాయణరెడ్డి, బోవిళ్ల నందగోపాల్‌రెడ్డి, రైల్వేకాంట్రాక్టర్ శ్రీనివాసులు, ఎల్ఎస్‌పీ కమిటీ చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డి, బొమ్మన సుబ్బరాయుడు, ఈగ సుబ్బారెడ్డి, ఈగ సుమన్‌రెడ్డి, ఎస్‌బీవీఆర్ కళాశాల ఏఓ మన్యం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మణ్యం రామిరెడ్డి, ఏసియన్ కేబుల్ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్, కౌన్సిలర్ రాగిమాను రవితేజ, బోవిళ్ల విష్ణు వర్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భైసాని ప్రతాప్ రెడ్డి, యారవ సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, సాధనకారి రంతు, సీతా వెంకటసుబ్బయ్య, సీతా బాలాజీ, ఇమామ్ హుస్సేన్, హబీబున్నీసా, పుల్లప్ప నాయుడు, కొండారామక్రిష్ణారెడ్డి, శెట్టెం ప్రతాప్, వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, కనుమర్లపూడి ప్రసాద్, మస్తాన్‌బాబు, షేక్ మన్సూర్, జహంగీర్‌బాషా, మద్దిరెడ్డి, వెంగళ శ్రీనివాసులరెడ్డి, చెరకూరి చెన్నరాయుడు, మాచుపల్లె లక్ష్మీదేవి, మిత్తికాయల సునీత, ఝాన్సీ క్రిష్ణారెడ్డి తదితరులు ఆయన ఘాట్‌వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైసీపీ నాయకులు కారుతో ఢీకొట్టి గాయపరిచారు

● ఎస్పీకి టీడీపీ నాయకుల ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రంలో వైసీపీ నాయకులు వాహనాలతో వచ్చి తనను ఢీకొట్టి గాయపరచారని బుధవారం పీటీఎంకు చెందిన టీడీపీ నాయకుడు పాలగిరి రామాంజులు ఆపార్టీ నాయకులతో కలసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం కోర్టు ఆదేశాలతో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు వైసీపీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు తమ వాహనాలలో వచ్చారన్నారు. కాగా తాను గ్రామంలో ఉన్న మంచినీటి సమస్యను మండల సమావేశంలో అధికారులకు విన్నవించేందుకు వెళుతుండగా ఎంపీడీవో కార్యాలయ సమీపంలోకి రాగానే వాహనంతో నామీదకు చొచ్చుకు వచ్చారన్నారు. దీంతో నా కాలికి గాయమై పక్కకు పడిపోవడంతో వారు వాహనాన్ని నిలిపి నాపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులైన మద్దిరెడ్డిపల్లెకు చెందిన పట్టా చంద్ర మోహన్‌రెడ్డి, డి.నారాయణపల్లెకు చెందిన ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు అక్కడికి చేరుకుని వారి నుంచి నన్ను కాపాడారన్నారు. నాపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మంచాలమ్మ ఆలయంలో చోరీ

నందలూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆడపూరు గ్రామంలో ఉన్న మంచాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. 3 వెండి కిరీటాలు, 3 వెండి దీపాలు, ఒక శఠగోపం, 2 వెండి ప్లేట్లు అపహరించారు. ఏఎస్ఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ ఇద్దరిని అదుపు లోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

కాలయాపన కోసమే కమిటీ : తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీని అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం కాలయాపన కోసమే మంత్రుల కమిటీని నియమించిందని ఏపీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. కర్ణాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేసిందన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు రోజుల్లోపలే అమలు చేసి మాట నిలబెట్టుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరు నెలలు దాటినా అతీగతీ లేదన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ నివేదిక కూడా ఇచ్చిందన్నారు. నెలకు రూ.250కోట్ల అదనపు ఖర్చు, అదనగా రెండువేల బస్సులు కావాలని, 11,500 మంది సిబ్బంది అదనంగా కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. ఆ నివేదికను అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ మంత్రుల కమిటీని నియమించిందన్నారు. ఈ ప్రక్రియ అంతా కాలయాపన కోసమే అన్నారు. కనీసం సంక్రాంతి నుంచైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలని తులసిరెడ్డి కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీ... నలుగురికి గాయాలు

కలసపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపల్లె వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. కలసపాడు నుంచి స్వగ్రామమైన సింగరాయపల్లెకు ద్విచక్రవాహనంలో వెళుతున్న రాజు అనే వ్యక్తి, ఎగువ రామాపురం నుంచి ఫారెస్టు డిపార్ట్‌మెంటులో పనిచేస్తున్న బాషా అనే వ్యక్తి ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాజు అనే వ్యక్తి కుడి మోకాలు వద్ద విరిగింది. బాషాకు మిగతా ఇద్దరికి కూడా కొద్దిపాటి గాయాలయ్యాయి.

ఏపీజీబీ కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రదాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని సేవ్ పబ్లిక్‌సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బ్యాంకు కార్యాలయాన్ని కడపలో కొనసాగించాలని రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్బర్‌బాష, నరసింహులు, బాబ్జి, రామిరెడ్డి, రాజశేఖర్, క్రిష్ణ, రాజేష్, డాక్టర్ చక్రధర్, చంద్రశేఖర్, తవ్వా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మదనపల్లె ఎస్బీఐ కాలనీలోని పీటర్‌రాక్ చర్చిలో ప్రత్యేక వేషధారణలో చిన్నారులు

కలకడ కె.కొత్తపల్లె చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



మదనపల్లె అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మదనపల్లె పట్టణం, మండలంలోని క్రైస్తవులు బుధవారం చర్చిలలో, పార్థన మందిరాల్లో క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. మదనపల్లె పట్టణంలోని పురాతనమైన జాకబ్‌చాంబర్లిన్ చర్చిలో రాయలసీమ డయాసిస్ బిషప్ రెవరెండ్ వరప్రసాద్ యేస్తుక్రీస్తు దైవ దూతగా మానవ రూపంలో ఈ లోకానికి వచ్చారన్నారు. ప్రజల్లో శాంతి, దయ, నిస్వార్థం, పేమ నింపడానికే ప్రభువు వచ్చారన్నారు. సీఎస్ఐ చర్చి ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో పండుగ శోభ సంతరించుకుంది. మహిళలు క్రీస్తు ఆరాధన పాటలు ఆలాపించారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సీఎస్ఐ చర్చిలో స్థానిక చిత్తూరు బస్టాండ్ సమీపంలోని ఇమ్మానియల్ మినిస్ట్రీస్ చర్చిల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. సీఎస్ఐ హైస్కూల్ ఆవరణలోని షెకీలాఫెయిత్ వినిస్ట్రేస్ చర్చిలో పాస్టర్ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో షేరీనా పెయిత్ ఫౌండేషన్ నిర్వహకుడు డేవడ్‌రాజు, దినేష్‌పాల్, వికాష్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ చర్చిలో, సెయింట్ లూక్స్ చర్చిలో, పోతబోలు చర్చిలో క్రిస్మస్ ప్రత్యేక పార్థనలు చేశారు.

పీలేరులో: పీలేరు మండలంలోని క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కరుణామయుడు యేసు క్రీస్తు బోధించిన మార్గమే ఆచరణీయమని ఆయా ప్రార్థనా మందిరాల్లో మతబోధకులు పేర్కొన్నారు. పీలేరులోని చిత్తూరు రోడ్డు, తిరుపతి రోడ్డు, ట్రాన్స్‌కో కార్యాలయం తదితర ప్రార్థనా మందిరాలతోపాటు వివిధ గ్రామాల్లో ఉన్న చర్చులు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడమే కాకుండా పేదలకు అన్నదానం చేశారు. ప్రార్థనల కోసం వచ్చిన వారికి అసౌ కర్యం కలుగకుండా ఆయా ప్రార్థనా మందిరాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని పలు గ్రామాలలో క్రిస్మస్ వేడుకలను పాస్టర్లు ఘనంగా నిర్వహించారు. బుధవారం లోకరక్షకుడు మేసు ప్రభు పట్టినరోజు సందర్భంగా పలు చర్చిలలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ప్రతి ఒక్కరు భక్తి భావంతో ఉండాలని పెద్దమండ్యం బేతస్థ చర్చీ ఫాస్టర్ శ్యాముల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దమండ్యం, వెలిగల్లు, తురకపల్లి గ్రా మాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్రంకొండలో: గుర్రంకొండ మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా గుర్రంకొండ పీటర్ రాక్ చర్చిలో ఫాదర్ జాన్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరా లు జరుపుకున్నారు.

కలకడలో: కలకడ మండలంలోని పలు చర్చిలో క్రిస్మస్ పర్వదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దుస్తులు పంపిణీ చేసి పేదలకు అన్నదానాలు చేశారు. తరువాత పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ములకలచెరువులో: మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ములకలచెరువు, మద్దినాయనిపల్లె, సెంట్రల్ స్కూల్, పర్తికోట, పెద్దపాళ్యం తదితర గ్రామాల్లోకి చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానాలు చేశారు. అలాగే పాత ములకలచెరువు, ములకలచెరువు ప్రార్థనా మందిరాల్లో టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ, ఫాస్టర్ శ్రీనివాసులు, గంగాదేవి తదితరులు కేక్‌లు కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో యేసు క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ చర్చిలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసారు. మండల పరిధిలో ఉన్న చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. . అనంతరం కేకు కట్ చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుని సంబరాలు జరుపుకున్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవులు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిని ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించి, కేకు కట్ చేసి పంచిపెట్టారు. ఈసందర్భంగా చర్చి ఫాస్టర్ మేరీ క్రిస్మస్ పండుగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం చర్చి ఎదుట నిరుపేదలకు దాన ధరాలు చేపట్టారు. అలాగే మండలం వ్యాప్తంగా ప్రార్థనా మందిరాలలో పండుగ వేడుకలు జరుపుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈకార్యక్రమాలలో స్థానిక చర్చి కమిటీ సెక్రటరీ జోసెఫ్, సభ్యులు ప్రభు చరణ్, రవి, ఆనంద్, క్రైస్తవులు పాల్గొన్నారు.

కురబలకోటలో: మండలంలోని అంగళ్లు సియోను ప్రార్థనా మందిరం, తెట్టు, కామూరివాండ్లపల్లె, ఆరోగ్యపురం తదితర చర్చిలలో క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు.

బి.కొత్తకోటలో: క్రైస్తవులకు అత్యంత ప్రాముఖ్యమైన క్రిస్మస్ పర్వదినాన్ని బి.కొత్తకోట మండలంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని రంగసముద్రం రోడ్డు, నందిశెట్టివీధిలలోని చర్చిలతో పాటు, శంకరాపురం, కుమ్మరి వాండ్లపల్లె, గోళ్లపల్లె చర్చిలలో ఆయా పాస్టర్లు క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. చర్చిలను సుందరంగా అలంకరిచారు. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరాల ప్రాంగణంలో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. నగరపంచాయతీ కమిషనర్ పల్లవి, తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ లు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిపారు.



పాత ములకలచెరువులో కేక్‌కట్ చేస్తున్న నాయకులు



పీలేరులో ధార్మికోపన్యాసం చేస్తున్న పాస్టర్ సుందర్‌రావు



వాల్మీకిపురం చర్చిలో పండుగ విశిష్టతను తెలుపుతున్న పాస్టర్ మేరీ

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్



గుర్రంకొండ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్‌ను రెవెన్యూ అధికారలు సీజ్ చేసిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. గుర్రంకొండ తహశీల్దార్ శ్రీనివాసులు వివరాల మేరకు గుర్రంకొండ పట్టణంలోని స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని గుట్టను ప్రొక్లెన్‌తో మట్టిని తవ్వి టిప్పర్లలో రియల్ వ్యాపారులు తరలిస్తున్నారు. ఈ మట్టిని మార్కెట్ యార్డు వద్ద రోడ్డు పక్కనున్న స్థలంలో తోలి చదును చేస్తున్నారు. ఈ క్రమంలో అక్రమంగా మట్టి తరలించరాదంటూ రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు సూచించారు. రియల్ వ్యాపారులు వినకపోవడంతో తహశీల్దార్ శ్రీనివాసులు గుట్ట వద్దకు చేరుకొని మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. సీజ్ చేసిన టిప్పర్‌ను పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో వీఆర్వో సదాశివ, భరత్ ఉన్నారు.

మిద్దె మెట్లపై పైనుంచి పడి యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మిద్దె మెట్లపై నుంచి పడి తలకు గాయమై యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. బుధవారం స్థానిక ఆర్ఆర్ వీధికి చెందిన గణపతి సంగ్(35) ఇంట్లో నుంచి మెటికలు దిగుతుండగా కిందపడి తలకు గాయం అయ్యింది. వెంటనే కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు పరీక్ష చేసి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అతను ఆర్ఆర్ వీధిలో ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మద్యం మత్తులో ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య ఘర్షణ .. ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో ఇద్దరు ఆటోడ్రైవర్లు గొడవపడి బుధవారం రాత్రి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న సంఘటన మదనపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మదనపల్లెకు చెందిన ఇద్దరు ఆటో డ్రైవర్లు దిలీప్, ఫయాజ్‌లు ఓ వైన్ షాపు వద్ద మద్యం తాగి గొడవపడ్డారు. ఇందులో భాగంగా దిలీప్ అతని అనుచరులు ముగ్గురు కలిసి స్థానిక ఈశ్వరయ్య కాలనీకి చెందిన మరో ఆటోడ్రైవర్ ఫయాజ్‌పై కత్తితో దాడిచేసి గాయపర్చారు. ఈ ఘటనలో అతను చెయ్యి అడ్డుగా పెట్టడంతో చేతికి గాయమైంది. వెంటనే స్థానికులు చికిత్స కోసం మదనపల్లె జిల్లా బోధనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అతడిని మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గుమ్మడి కాదు.. బొప్పాయే...



వాల్మీకిపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం గుమ్మడి కాదు.. బొప్పాయి. వాల్మీకిపురం సమీపంలోని గొల్లపల్లె మార్గంలో రైతు శేఖర్ సాగు చేసిన బొప్పాయి తోటలో ఓ చెట్టుకు ఓ బొప్పాయి గుమ్మడి ఆకారంలో విచిత్రంగా కాసింది. అయితే అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తున్న ఇది గుమ్మడి అనుకుని పొరపడుతున్నారేమో.. కాని ఇది బొప్పాయే.

జ్యువెలరీ అసోసియేషన్ కార్యదర్శిగా పీలేరు వాసి



కార్యదర్శిగా ఎన్నికైన ముచ్చెర్ల బాబు

పీలేరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లా ల జ్యువెలరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పీలేరుకు చెందిన ముచ్చెర్ల జ్యువెలరీస్ అధినేత ముచ్చెర్ల శ్రీనివాసులు(బాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన జ్యువెలరీ అసోసి యేషన్ ఎన్నికల్లో ఆయన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయనను బుధవారం రాత్రి పీలేరులో పలువురు అభినందించారు.

అడవి పంది మృతితో బయటపడిన విద్యుత్ చౌర్యం

పీలేరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అడవి పంది మృతితో విద్యుత్ చౌర్యం వెలుగులోకి వచ్చిన సంఘటన బుధవారం పీలేరులో జరిగింది. పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ కమ్మమిట్టపల్లె పంచాయతీ పరిధిలోని కొంత మంది రైతులు అడవి పందుల బెడద నుంచి తప్పించుకోవడానికి పొలాల చుట్టూ విద్యుత్ తీగలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆ ఫెన్సింగ్ తగులుకుని ఓ అడవి పంది మృతి చెందింది. ఆ సమయంలో లోడు అధికం కావడంతో కమ్మమిట్ట ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఎక్కడ లోపం ఉందోనని వెతుక్కుంటూ బయలుదేరిన ఆ ప్రాంత విద్యుత్ లైన్‌మ్యాన్‌కు అడవి పంది మృత దేహం కంట పడింది. దీంతో అతను ఈ విషయాన్ని తన ఉన్నతాధికారులకు తెలియజేశాడు. వారి సూచన మేరకు అతను విద్యుత్ చౌర్యంతో పాటు అడవి పంది మృతిపై పోలీసులకు సమాచారం అందించాడు. ఈ విషయమై డీఈ చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఫెన్సింగ్ ద్వారా కొంత మంది రైతులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించామని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయమని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించామని వివరించారు. ఈ విషయం బుధవారం అగ్రహారంలో చర్చనీయాంశం అయ్యింది.

వ్యక్తిపై దాడి.. అరెస్టు చేయాలంటూ నిరసన

మదనపల్లె అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణంలోని మేదరవీధికి చెందిన వేంకటేష్, తన తల్లి కళావతితో కలిసి బైకుపై వెళుతుండగా స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి బైకుతో వచ్చి ఢీకొట్టాడు. ఇది ఏమి అని ప్రశ్నించిన అతను వెంకటేష్‌ను అతని తల్లి ఎదుటే బట్టలు చింపి దాడిచేశాడు. దీంతో ఆగ్రహించిన అతని అనుచరుల తో పాటు కొందరు టూటౌన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సంఘటన తెలుసుకున్న టూటౌన్ సీఐ రామచంద్ర అక్కడికి చేరుకుని పరిస్థితిని మదనపల్లె డీఎస్పీకి వివరించారు. వెంటనే డీఎస్పీ సీఐతో కలిసి నిరసనకారులతో మాట్లాడి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కలకడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని కదిరాయచెరువు పంచాయతీ బొంతలవారిపల్లెకు చెందిన బాలిక(15) అదృశ్యమైన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు టెన్త్ చదువుతున్న బాలిక మంగళవారం రాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో అదృశ్యమైంది. బాలిక ఆచూకీ కోసం చుట్టు పక్కల వెతికినా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ములకలచెరువు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నరసింహులు(60) అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన నరసింహులు పని నిమిత్తం ద్విచక్రవాహనంలో బయలుదేరి వెళుతుండగా ఈ క్రమంలో చిన్నేరు వంతెనపై వాహనాన్ని కారు ఢీకొంది. ఈప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడడంలో చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

వైభవంగా వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ



వినాయక విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పూజలు చేస్తున్న గ్రామస్థులు

తంబళ్లపల్లె, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపిదిన్నె పంచాయతీ బల్లాపురంపల్లె తారక రామానగర్లో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం గ్రామస్థులు వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచే వేదపండితులు గణపతి పూజ, గుర్దుపూజ, యంత్రప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య మంగళవాయిద్యాలు మంత్రోచ్ఛారణల నడుమ శిఖర కలిశ ప్రతిష్ఠ అనంతరం వరసిద్ధి వినాయక స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తంబళ్లపల్లె జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, కూటమి నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు వీరాంజినేయులు, సుధాకర్‌నాయక్, వెంకట్రమణ, లక్ష్మీదేవి, వినోద్‌కుమార్, దేవెంద్రరెడ్డి, ప్రతాప్, లక్ష్మన్ననాయక్, రెడ్డప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి శతజయంతి వేడుకలు



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి):మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను మదనపల్లె రూరల్ మండలంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్య క్రమంలో మదనపల్లె రూరల్ మండల అధ్యక్షుడు పచ్చిపాల వసంత కుమార్ మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్‌పేయి భారత ప్రజాస్వామ్యం, జాతీయ ఐక్యత, సామాజిక సామరస్యం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, సీనియర్ నాయకుడు కృష్ణయ్య వర్మ, గంధరంరెడ్డి కిషోర్‌యాదవ్, కిరణ్‌కుమార్, మురళీకృష్ణ, వాసు. ఫణీంద్ర, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: భారతదేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలను ఆపార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామాంజులు, శేషాద్రినాయుడు, భరత్, మురళీ, రెడ్డెప్ప, రామాంజులు, మధు తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కలాం బుక్ ఆఫ్ రికార్డ్సుకు మదనపల్లె విద్యార్థి



చిన్నారికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): చిన్న వయ్యస్సు లోనే చిన్నారి డీఏ హేమంత్ బ్లాక్ బెల్ట్ సాధించి కలాం బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించు కున్నాడు. చిన్నోడికి స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతులమీదుగా బుధవారం ప్రశంసా పత్రం, మెడల్, మెమెంటో తమిళనాడు రాష్ట్రం చైన్నై నుంచి ప్రతిష్టాత్మకమైన కలాం బుక్ ఆఫ్ రికార్డ్సు అధికార ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భం గా తల్లిదండ్రుల డీఎం అభినయ్‌కాంత్, బి.నిరూపలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహకుడు కరాటే మాస్టర్ ఏఆర్ సురేష్, నంద, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం ఎంపీపీ అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహరరాజు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధికారులు,, ప్రజా ప్రతినిదులు హాజరు కావాలని కోరారు.

మురుగు నీటి కాలువ సమస్యకు పరిష్కారం



మురుగు కాలువ తవ్వకం పనులు చేస్తున్న దృశ్యం

కలికిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె-తిరుపతి మార్గంలో జాతీయ రహ దారి పొడవునా విద్యుత్ డీఈఈ కార్యాల యం నుంచి గాంధీ సర్కిల్ వరకూ దీర్ఘకా లంగా తిష్ట వేసిన మురుగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవ తీసు కోవ డంతో స్థానిక పంచాయతీ మురుగు నీటి కాలువ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఈ జా తీయ రహదారి పక్కన హోటళ్ళు, దుకాణాలతోపాటు ఇతరత్రా వాణిజ్య సముదా యాలున్నాయి. అయితే రోడ్డుకు ఇరువైపులా మురుగు నీటి కాలువ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహించడం పరిపాటిగా మారింది. సోమవారం ఈ అంశంపై పంచాయతీ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు ఆర్. యోగేష్‌రెడ్డి, కార్యదర్శి అశోక్‌తో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి చర్చించి జాతీయ రహదారి సంస్థ తిరు ఎతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో సమస్య పరిష్కారం కోసం సంప్రదింపులు జరిపారు. ఎట్టకే లకు జాతీయ రహదార్ల పీడీ స్థానిక గ్రామ పంచాయతీ తాత్కాలికంగా మురుగునీటి పారుదల కోసం పైపు లైను ఏర్పాటు చేసేందుకు పనులను ప్రారంభించారు.

క్యాన్సర్ బాధితుడికి టీడీపీ నేత ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న జమీర్(37)అనే వ్యక్తికి తంబళ్లపల్లె టీడీపీ నేత కట్టాదొర స్వామినాయుడు రూ.35వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మదనపల్లెకు చెందిన జమీర్ క్యాన్సర్‌తో బాధపడుతూ మెరుగైన చికిత్సలకు డబ్బులు లేక అవస్థలు పడుతున్న విషయం తెలుసుకున్న కట్టాదొర స్వామినాయుడు మదనపల్లెకు వచ్చి బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కార్యాలయానికి జమీర్, ఆయన భార్య ఆయేషాల పిలిపించి తన సొంత డబ్బు రూ.35వేలును బాధితుడికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా అందజేశారు. షాజహాన్‌బాషా మాట్లాడుతూ కాన్సర్ బాధితుడికి చికిత్సల పరిస్థితి విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహాయం అందేలా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికసంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులునాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీటీఎం రోడ్డును అభివృద్ధి చేస్తాం

మదనపల్లె పట్టణంలోని సీటీఎం రోడ్డును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక బర్మారోడ్డు నుంచి టౌన్‌బ్యాంకు సర్కిల్ వరకు సీటీఎం రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. గతంలో చింతచెట్లను తొలగించిన స్థానంలో ఏర్పడ్డ గోతులను ఎర్రమట్టితో పూడ్చి, చదును చేయిస్తున్నామని, దుకాణదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జునైద్‌అక్బారి, మధుసూధన్‌రెడ్డి, కమలమ్మ్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటాం



టీడీపీ నాయకుడు కేకే నాయుడిని పరామర్శిస్తున్న ఆ పార్టీ నేతలు

వాల్మీకిపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వాల్మీకిపురం పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కేకే నాయుడు అనారోగ్యంతో బాధపడు తుండగా విషయం తెలుసుకున్న కంభం నిరంజన్‌రెడ్డి ఆయన స్వగృహానికి చేరుకుని పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు క్రిష్టారెడ్డి, పీవీ నారాయణ, చంద్రమౌళి, శేషాద్రిరెడ్డి, మైనార్టీ నాయకులు సయ్యద్‌బాషా, తెలుగు యువత చాను, కువైట్ సయ్యద్‌బాషా, బాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలను వెంటనే మంజూరు చేయాలి



పెన్షనర్లను సన్మానిస్తున్న ఆ సంఘ సభ్యులు

పీలేరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఏలతోపాటు ఇతర అరియర్స్‌ను వెంటనే మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం పీలేరు శాఖ అధ్యక్షుడు చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెన్షనర్లతో స్థానిక మెయిన్ స్కూలులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సంబంధిత అంశాలను మంజూరు చేస్తే పెన్షనర్లకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదే విధంగా పీఆర్‌సీ కూడా వెంటనే ప్రకటించాలన్నారు. పెన్షనర్లందరూ తమ ఆదాయ పన్ను రిటర్న్‌ను దాఖలు చేయాలని ఆయన సూచించారు. పెన్షన్‌ల కొనసాగింపునకు అనుకూలంగా జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ మధ్యలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని గుర్తు చేశారు. అనంతరం 80 వసంతాలు పూర్తి చేసుకున్న తమ సహచరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వి.రామచంద్ర, ఎర్రమరాజు, జి.రాధాకృష్ణ, నరసింహారెడ్డి, కృష్ణయ్య, సీతారామయ్య, ఆంజనేయులు, రాజశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతులు దహనం



మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పీలేరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మనుస్మృతి ప్రతులను బుధవారం పీలేరులోని స్థానిక ప్రజాసంఘాల నాయకులు దహనం చేశారు. 1927 డిసెంబరు 25న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనుస్మృతి ప్రతులను దహనం చేసి తొలి సారిగా వాటి వల్ల భారత సమాజానికి జరిగిన అన్యాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని, ఆ క్రమంలోనే తాము కూడా వాటిని దహనం చేశా మన్నారు. రాజ్యాంగ ప్రేమికులు, ప్రజాస్వామ్యవాదులు, లౌకికశక్తులు ఏకమై వాటికి వ్యతిరే కంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు వెంకటరామయ్య, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ, మాలమహా నాడు నాయకులు తుమ్మల ధరణీ కుమార్, ఆనంద్, సురేంద్ర, బాలగంగాధర్, రవిచంద్ర, రాజేంద్రబాబు, 'బాస్' నాయకుడు మల్లిఖార్జున, జాతీయ అంబేడ్కర్ సేవా సంఘం నాయకుడు సదాశివ, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుండ్లూరు రాజేశ్వరి, మాషా అల్లాహ్ ఆటో యూనియన్ నేతలు సయ్యద్ చాన్ బాషా, మహబూబ్ బాషా, 'మేము సైతం' ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ షాహిన్‌షా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన నేత జన్మదిన వేడుకలు



ములకలచెరువులో జనసేన ఇన్‌చార్జి సాయినాథ్‌కు కేక్ తినిపిస్తున్న టీడీపీ నేత పాలగిరి సిద్ధా

ములకలచెరువు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండు సర్కిల్‌లో సాయినాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా తదితరులు భారీ కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అలాగే నాయనిచెరువుపల్లె, మద్దినాయనిపల్లె తదితర గ్రామా ల్లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు గుత్తా సుధాకర్‌నాయుడు, సుదర్శన్, షోరూం సూరి, సుబ్బనాయుడు, అనీల్, ఉత్తన్న, బావాజాన్, ప్రతాప్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యంలో బుధవారం తంబళ్లపల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మండల జనసేన నాయకులు ఆధ్వర్యంలో జనసేన, కూటమి నేతలు బర్త్‌డే కేక్ కట్ చేసి సంబరాలు జరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల జనసేన నాయకుల ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో జనసేన సేవా మార్గంలో నడుస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగూరి మస్తాన్‌వలీ, అస్రఫ్, ధనాంజనేయ, నారా శ్రీనివాసులు, మనోహర్, ప్రదీప్,హర్ష, చిన్నరెడి బాష, హుస్సేన్, సాగర్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.